

కాలం విలువ తెలుసుకో.. విజయం దిశగా సాగిపో..!

కాలం చాలా విలువైనది.. ఒక్క నిమిషం కూడా వెనక్కు తిరిగిరాదు.. నిన్నో.. మొన్నో 2024లో అడుగుపెట్టినట్టుంది.. అప్పుడే 365 రోజులు అయిపోయాయి.. రోజులు క్షణాల్లా గడచిపోయాయి. 2025లో అడుగుపెట్టేశాం.. ఈ ఏడాది ఏం సాధించామంటే.. చాలామందికి ఒక క్వశ్చన్ మార్క్.. ఏదో అలా గడిపేస్తారు.. 2025 మాత్రం అలా కాకూడదు.. మనకంటూ ఒక లక్ష్యం ఉండాలి.. పట్టుదలగా సాధించాలనే తపన ఉండాలి.. అందుకు ఏం చేయాలంటే.. 2+0+2+5 ఫార్ములా వాడాల్సిందే.. విజయం సాధించాల్సిందే.. మన జీవితం మన చేతుల్లోనే ఉంది.. ఒక్కసారి రెడీ వన్ టూ త్రీ అంటూ విజయం దిశగా పరుగెత్తి చూడు.. అపజయం తలవాల్చుతుంది.. ఈ సక్సెస్ ఫార్ములా విజయం వాకిట నిలబెడుతుంది.. హ్యాపీ న్యూ ఇయర్...



2 — ఉదయం.. సమయం..

విజయం సాధించిన ఎవరి జీవితాన్ని తరచి చూసినా అందులో ఉషోదయానిది, సమయపాలనది తొలి వరుస.. నేడు యువత పద్ధతి మారింది.. సమయపాలన అనేది లేకుండా పోయింది.. రాత్రంతా మేల్కొని ఉండడం.. బయట తిరగడమో, లేదా సెల్‌తోనే కాలక్షేపం చేయడం.. ఎప్పుడో తెల్లవారుజామున పడుకోవడం.. ఆలస్యంగా లేవడం ఇదీ దినచర్య.. ఉషోదయం చూసే యువతను వేళ్ల మీద లెక్కించవచ్చు. ఈ ఏడాదైనా అది మారుద్దాం.. ఉషోదయాన్నే లేద్దాం.. వాకింగో, వ్యాయామమో చేద్దాం.. ఇక ఎవరికైనా విలువైనది టైమ్. సమయపాలన కూడా విజయానికి బాట వేస్తుందని నిరూపిద్దాం!

0 — హీరో కాదు.. 'జీరో'

యువత చెడు అలవాట్లకు బానిసలుగా మారిపోతున్నారు.. ఈజీ మనీ కోసం ఎగబడుతున్నారు.. గంజాయి.. మందు.. పేకాట.. డ్రగ్స్‌కు బానిసలవుతున్న వారి సంఖ్య పెరుగుతోంది.. మరోవైపు ఈజీ మనీ కోసం పక్కదారి పడుతున్నారు.. గంజాయి రవాణా.. మద్యం అమ్మకాలు తదితర అసాంఘిక కార్యకలాపాలకు అలవాటుపడుతున్నారు.. జీవితాలను చేతులారా నాశనం చేసుకుంటున్నారు.. నేరాల చిట్టా తిరగేస్తే యువత పాత్ర స్పష్టమవుతోంది. డ్రగ్స్ ఇతర చెడు అలవాట్లకు విద్యార్థులూ చిక్కుతున్నారు. ఈ దారిలో ప్రయాణిస్తే హీరోలు అవ్వరు. వీటికి దూరంగా 'జీరో'గా ఉంటేనే బెటర్..!

2 — లక్ష్యం.. సరి'కొత్తగా..'

ప్రతి ఒక్కరికీ ఒక లక్ష్యం ఉండాలి.. సాధించాలనే తపన.. కొత్త ఏడాది చాలామంది ఏవో లక్ష్యాలు పెట్టుకుంటారు. కానీ వాటిని సాధించాలంటే పట్టుదల ఉండాలి.. క్రమబద్ధమైన ప్రణాళిక ఉండాలి. లక్ష్యం కోసం కష్టపడాలి. విజయాన్ని సాధించడమే కాదు, సాధించే క్రమంలో సాగే ప్రయాణాన్ని ప్రేమించాలి. అప్పుడు గురి కుదురుతుంది. లక్ష్యం మీ వశం అవుతుంది. ఈ జనరేషన్‌తో పరుగుపెట్టాలి. అంటే కొత్తగా ఆలోచించాలి. అప్‌డేట్ కావాలి. విద్యార్థులైనా, యువత అయినా, ఉద్యోగులైనా, వ్యాపారులైనా ఏ రంగంలో ఉన్నా కొత్త సమాచారంపై అవగాహన ఉండాలి. టెక్నాలజీపై పట్టు సాధించాలి..!

5 — సక్సెస్‌కు ఐదు మెట్లు..

విజయానికి ఈ ఐదూ పాటించాల్సిందే..
- శ్రమయేవ జయతే అన్నారు.. ఎవరు కష్టపడతారో వారిదే విజయం..
- చెప్పడం కన్నా వినడానికి, తెలుసుకోవడానికి ప్రాధాన్యం ఇవ్వాలి. పుస్తకాలు చదవాలి. లోకం పోకడ, ప్రాపంచిక విషయాలపై జిజ్ఞాస ఉండాలి.
- నాయకత్వ లక్షణాలు ఉంటేనే సరైన విజయం సిద్ధిస్తుంది. బృందంతో కలిసి పనిచేయడంలో చురుకైన పాత్ర ముఖ్యం.
- ఆనందంగా గడిపే సమయం ఉంచుకోవాలి. ఒత్తిడిని అధిగమించాలి. కొత్త ప్రాంతాలను సందర్శిస్తే అదే 'రీచార్జ్'
- బంధాలను నిలుపుకోవడం నిరంతరం సాగాలి. కళాత్మకంగా జీవితాన్ని నిర్మించాలి.

అందరూ సంతోషంగా ఉండాలి..

కలెక్టర్ ప్రశాంతి



రాజమహేంద్రవరం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సరం వేళ అన్ని కుటుంబాల్లో సంతోషాలు వెల్లివిరియాలని, ఆరోగ్యంతో అందరూ వర్థిల్లాలని ఆకాంక్షిస్తూ జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి నూతన సంవత్సర శుభా కాంక్షలు తెలిపారు.ఈ మేరకు మంగళవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. న్యూ ఇయర్, సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జిల్లా ప్రజలకు ప్రజాప్రతినిధులు, అధికారులు, అనధికారులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులందరూ చక్కగా చదువుకుని మంచి ఉత్తీర్ణత సాధించాలని అభిలాష వ్యక్తం చేశారు.

కొత్తగా.. 2025 పయనిద్దాం!



మేలుకో యువత.. మీదే భవిత

- కొత్త ఆశలు, ఆకాంక్షలతో 2025లో అడుగేద్దాం..
- పట్టుదల, ఉక్కుసంకల్పంతో అనుకున్నది సాధిద్దాం
- అత్యున్నత శిఖరాలకు ఎదిగేలా సంకల్పం చెబుదాం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

జీవితం... మన చేతుల్లోనే.. చేతల్లోనే ఉంది.. ఆకాశమంత ఎత్తుకు ఎదగాలన్నా.. అధఃపాతాళానికి పడిపోవాలన్నా అంతా మన చేతుల్లోనే ఉంటుంది. నలుగురు మెచ్చేలా విజయం సాధించి అందరికీ స్ఫూర్తిగా నిలబడేలా అవకాశం అందరికీ వస్తుంది.. కానీ నిలబెట్టుకునేది కొందరే.. తల్లిదండ్రుల మాట వింటూ గురువుల అడుగు జాడల్లో నడిస్తే అనుకున్నది సాధించి ఎంతో ఎత్తుకు ఎదగడం సులువే.. కానీ వారిని ధిక్కరించి కెరీర్‌ను టేకిట్ ఈజీగా తీసుకుని చెడు వ్యసనాలకు బానిసై జీవితాన్ని పాడు చేసుకుంటున్న వారెందరో ఉన్నారు. కొంగొత్త ఆశలతో కొత్త సంవత్సరంలోకి అడుగు పెడుతున్న వేళ.. ప్రతి ఒక్కరూ ఓ చాంపియన్‌గా ఎదగాలనే సంకల్పంతో కదిలితే అనుకున్న రంగంలో యువత విజయం సాధించడం కష్టమేం కాదు.. దీనికి స్ఫూర్తిగా నిలుస్తున్న వారెందరో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచే నిరూపిస్తున్నారు. అందుకే కొత్త సంవత్సరంలోకి అడుగుపెడుతున్న తరుణంలో గోదావరి జిల్లావాడిగా చెబుతున్న ఓ గుకేష్‌లా యువత కెరీర్‌లో విజయతీరాల వైపు కదలాల్సిన తరుణమిదే.

కలలు కనండి.. ఆ కలలను నిజం చేసుకోండి.. అని అబ్దుల్ కలాం అన్నారు.. యువతరం కూడా కలలు కనాలి.. అది నెరవేరే వరకూ గుకేష్ లా ప్రయత్నించాలి.. 18 ఏళ్ల యువకుడు గుకేష్ అతి చిన్న వయసులో వరల్డ్ చెస్ చాంపియన్‌గా నిలిచాడు.. ఈ విజయం ఒక్కరోజుతో వచ్చింది కాదు.. ఎన్నో ఏళ్ల కల.. ఆ కలను ఇటీవల నిజం చేసుకున్నాడు.. అందరి దృష్టిని ఆకర్షించాడు..ఈ ఒక్కడే కాదు.. ఇటువంటి వారెందరో ఉన్నారు.. ఇటీవల రాజమహేంద్రవరానికి చెందిన ఇద్దరు 12, 65 ర్యాంకులు సాధించి యూపీపీఎస్సీకి ఎంపికయ్యారు.. కోనసీమకు చెందిన మరో కుర్రాడు క్రికెట్ టీంకి ఎంపికై అందరినీ ఆశ్చర్యంలో ముంచాడు.. పట్టుదలతో ప్రయత్నిస్తే సాధించలేనిది ఏమీ లేదు.. అది చెస్ అయినా యూపీపీఎస్సీ అయినా.. ఇంకెందుకు ఆలస్యం కొత్తగా పయనిద్దాం.. అనుకున్నది సాధిద్దాం!

టాలెంట్ ఉండాలే కానీ.. అది ఏదో ఒక రూపంలో బయటపడుతూనే ఉంటుంది.. ఈ చిత్రమే చూడండి.. ఒక రావి ఆకులో అనపర్తి జీబీఆర్ కళాశాలకు చెందిన డిగ్రీ విద్యార్థిని బద్రిరాజు లక్ష్మీ సుప్రజ పార్వతి ఎంత చక్కగా చెక్కిందో.. చూస్తుంటే ఆహా అనిపిస్తుంది కదూ.. - అనపర్తి



2024 హీరోలు వీళ్లు..



గుకేష్ | ఉష్ణీష్ నందన్ | ప్రగతి | పీఎస్ఎన్ రాజు

కృషి ఉంటే మనుషులు రుషులవుతారు.. ఉక్కు సంకల్పంతో ముందుకు సాగితే జీవితంలో విజయతీరాలకు చేరుతారు. దీన్ని చేసి చూపించిన వారెందరో. 2024కు వీడ్కోలు పలుకుతూ 2025లోకి అడుగుపెడుతున్న వేళ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో యువత కొత్త ఆశలు.. ఆకాంక్షలతో ముందడుగు వేసేలా సంకల్పం చెప్పుకోవాల్సిన తరుణమిది. ఈ కొత్త ఏడాదిలో విజయం సాధించే దిశగా అడుగులు వేయాల్సిన సమయం రానే వచ్చింది. అది చదువులో అయినా.. ఉద్యోగ సాధనలో అయినా.. మీకు మీరే ఛాంపియన్‌గా ఎదగాలి. ఈ దిశగా ఈ కొత్త ఏడాది నుంచి ఆలోచనల్లో మార్పులతో ముందుకుసాగాలి. జీవితంలో విజయం సాధించడానికి వెన్నంటే మనకు తల్లిదండ్రుల రూపంలో గురువులు ఉంటారు. వీరి ప్రోత్సాహాన్ని విజయానికి మెట్టుగా వాడుకుని ముందుకు కదిలితే ప్రతి ఒక్కరు ఛాంపియన్‌గా ఎదుగుతారు. ఇందుకు ఎందరో విజేతలు జిల్లా నుంచే స్ఫూర్తిగా నిలుస్తున్నారు. 18 ఏళ్ల 18 నెలల వయసులోనే ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా గుకేష్ నిలిచి ఔరా అనిపించారు. రాజమహేంద్రవరానికి చెందిన బోళ్ల ఉష్ణీష్ నందన్ గతంలో జరిగిన యూపీపీఎస్సీలో 71 ర్యాంక్ సాధించి శిక్షణలో ఉన్నాడు.. అయితే ఎందుకో ఆ ర్యాంకు నచ్చలేదు.. పట్టుదలతో చదివాడు.. నవంబరు 22న విడుదలైన ఫలితాల్లో 12వ ర్యాంకు సాధించాడు. బొమ్మూరుకు చెందిన ప్రగతి తొలిసారి యూపీపీఎస్సీలో 65వ ర్యాంకు సాధించి ఔరా అనిపించింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లా రాజోలుకు చెందిన పెన్మత్స సత్యనారాయణరాజు క్రికెట్ టీమ్‌కి ఎంపికై చిన్ననాటి నుంచి ఉన్న తన లక్ష్యాన్ని చేరుకున్నాడు. ఇలా ఒకరేంటి ఉమ్మడి తూర్పుగోదావరిలో 22 లక్షల మంది యువతరంలో పట్టుదల, క్రమశిక్షణతో ఛాంపియన్‌లుగా నిలుస్తున్నవారెందరో. చదువు, ఉద్యోగం ఏదైనా సరే పట్టుదల, తల్లిదండ్రుల అండదండలతో కెరీర్‌లో సక్సెస్ అయ్యే అవకాశం యువత వదులు కోకూడదు. ఈ కొత్త ఏడాదిలో మీరూ విజేతగా నిలవాలంటే ఈ నూతన సంవత్సరంలో పట్టుదల, క్రమశిక్షణ, జీవితంలో ఎదగాలనే సంకల్పంతో అడుగులు ప్రారంభించాలి. మీరేంటో నిరూపించాలి. విజయం సాధించాలి.

బీసీలకు 1879 యూనిట్లు

రాజమహేంద్రవరం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : బీసీ కార్పొరేషన్ ద్వారా జిల్లాలోని జిల్లాలో బీసీలకు 2024-25కి రూ.52.46 కోట్లతో 1879 యూనిట్లు లక్ష్యంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో స్వయం ఉపాధి కోసం 1229 యూనిట్లు ఏర్పాటుకు మూడు శ్లాబ్‌ల కింద రూ.23.32 కోట్లతో ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఇందులో బ్యాంక్ రుణం 50శాతం, సబ్సిడీ 50శాతం ఉంటుందన్నారు.ఆన్‌లైన్ బెనిఫిషరీ మేనేజ్‌మెంట్ అండ్ మానటరింగ్ సిస్టమ్(ఓబీఎంఎంఎస్) ద్వారా ఎంపిక చేస్తామన్నారు.మినీ యూనిట్ల కేటగిరిలో 449 యూనిట్ల ఏర్పాటుకు రూ.5లక్షల యూనిట్ కింద రూ.22.46కోట్లలో ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. జనరిక్ మెడికల్ ఫార్మసీ యూనిట్ల కింద మొత్తం 24 యూనిట్లకు ఒక్కో యూనిట్ 8లక్షల వంతున మొత్తం రూ.కోటి 92లక్షలతో ప్రణాళిక అమలు చేస్తామన్నారు.50శాతం సబ్సిడీ ఉంటుందన్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
AJC ANDHRA JYOTHI CLASSIFIEDS

FINANCE

గవర్నమెంట్ రిటైర్డ్ పెన్షనర్స్‌క (కేంద్ర/రాష్ట్ర), ప్రభుత్వ ఉద్యోగస్తులకు (కేంద్ర / రాష్ట్ర) సులభ వాయిదాల పద్ధతిలో వెంటనే ఫైనాన్స్ చేయబడును. వెంకటేశ్వర ఫైనాన్స్. Govt. Reg.No.176/2019. Cell: 9550648668
AJD:

WANTED

రాజమండ్రి సిటీలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు, ఫీల్డ్ ఆఫీసర్ కావలెను. వయస్సు 50 సం॥లోపు. ఆకర్షణీయమైన జీతము. Cell : 9618331069, 8247814976.
AJG-204011





ఉండ్రాజవరం మండలం పసలపూడిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి దుర్గేష్

ఆనందించెన్

ఒక్క రోజు ముందే పింఛన్లు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఒక్క రోజు ముందుగానే పింఛన్ల పండగ వచ్చేసింది.. కొత్త ఏడాదిని ఆనందంగా జరుపుకోవాలని సీఎం చంద్రబాబు ఒక్కరోజు ముందుగానే మంగళవారం పింఛన్లు పంపిణీ చేయించారు. జిల్లాలో పింఛన్లు పంపిణీ అత్యంత వేగంగా సాగింది. రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం రాత్రి 7:55 గంటలకు 95.48 శాతం పింఛన్లు పంపిణీ పూర్తి చేశారు. జిల్లాలో 96.19 శాతం పింఛన్లు బట్వాడా చేసారు. ఉదయం 5 గంటల నుంచి పంపిణీ ప్రారంభించిన జిల్లా యంత్రాంగం రాత్రికి సుమారు 98 శాతం వరకు పూర్తి చేసింది. జిల్లాలో పింఛనుదారులు 2,36,927 ఉండగా 2,28,295 మందికి ఒక్కరోజులోనే పింఛన్లు అందజేశారు. జిల్లాకు రూ.101,93,56,000 విడుదల కాగా వాటిలో రూ.98,05,55,000 పంపిణీ చేశారు. ఇంకా పంపిణీ కొనసాగుతుంది. రాజమహేంద్రవరంలో 28,596 పింఛన్లకు 27774 పంపిణీ చేశారు. రూరల్‌లో 19691 మందికి 18951 మందికి అందజేశారు. కోరుకొండలో 12209 కు 11841 పంపిణీ చేశారు. రాజానగరంలో 15329 కి 14823 ఇచ్చారు. చాగల్లులో 9296కి 8989 అందజేశారు. నల్లజర్లలో 11446కి 11052 పంపిణీ చేశారు. గోపాలపురంలో 9059కి 8744 పంపిణీ చేశారు. దేవరపల్లిలో 10921 కి 10534 అందజేశారు. కొవ్వూరులో 10083 కి 9714 పంపిణీ చేశారు. గోకవరంలో 10460 కి 10076 పంపిణీ చేశారు. కడియంలో 11836కి 11392 పంపిణీ చేశారు. తాళ్ళపూడి మండలంలో 7806 పింఛన్లకు 7501 అందించారు. సీతానగరంలో 11472 కి 11021 పంపిణీ చేశారు. నిడదవోలులో 10374 కి 9959 పంపిణీ చేశారు. రూరల్‌లో 4242కి 4070 పంపిణీ చేశారు. రంగంపేటలో 8800కి 8438 అందించారు. పెరవలి మండలంలో 10231 కి 9825 పంపిణీ చేశారు. ఉండ్రాజవరంలో 10350 కి 9912 ఇచ్చేశారు. అనపర్తిలో 10231 కి 9796 పంపిణీ చేశారు. బిక్కవోలులో 10557 కి 10101 ఇచ్చారు.కొవ్వూరు రూరల్‌లో 3920 కి 3749 పింఛన్లు పంపిణీ చేశారు.కోరుకొండ మండలంలో కేవలం మూడు గంటల్లోనే పింఛన్లు పంపిణీ పూర్తిచేయడం గమనార్హం.










రాజమహేంద్రవరంలో పూలబొకేలు



కాకినాడ మార్కెట్‌లో డ్రైఫ్రూట్స్ బొకే



కాకినాడలో పూల బొకే షాప్

సందడే.. సందడి

మార్కెట్‌కు కొత్త కాంతి

స్పెషల్ కేకులు

పూల బొకేలు

కార్పొరేషన్(కాకినాడ), డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఎంతగానో ఎదురుచూస్తున్న కొత్త సంవత్సరం రానే వచ్చింది. దీంతో మంగళవారం జిల్లాలోని పలు నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో కొత్త సంవత్సరం వేడుకలు జరుపుకునేందుకు అంతా సిద్ధమయ్యారు. అందుకు తగిన విధంగా మార్కెట్‌లో వివిధ రకాల ఆకృతుల్లో కేకులు, రంగురంగుల పూలతో బొకేలు, పూల మొక్కలు అందరినీ ఆకర్షించేలా తయారుచేసి మార్కెట్‌లో ఉంచారు. దీంతో న్యూ ఇయర్ కేకులు, పూల బొకేలు కొనుగోలు చేసేందుకు నగరాలు, పట్టణాల్లో రహదారులన్నీ కిటకిటలాడాయి. అర్ధరాత్రి వేళ వేడుకలు చేసుకునేందుకు కేకులు కొనుగోలు చేసుకున్నారు. మరోవైపు తమ అభిమాన నాయకులకు శుభాకాంక్షలు తెలిపేందుకు అనుచరులు రెడీ అయిపోయారు. అందమైన ఆకృతుల్లో తయారైన పూలబొకేలను కొనుగోలు చేసేందుకు వారంతా మార్కెట్‌కు తరలివచ్చారు. స్వీట్ల దుకాణాలు కూడా కిటకిటలాడాయి. రకరకాల స్వీట్లను వ్యాపారులు సిద్ధం చేశారు.





కాకినాడలో కేకులు, స్వీట్ల దుకాణాల వద్ద రద్దీ ఏర్పడిన దృశ్యం



పండ్లతో అలంకరణ



వాడపల్లిలో పుష్పాలంకరణ

వాడపల్లిలో పుష్పాలంకరణ

ఆత్రేయపురం,డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం నూతన సంవత్సర వేడుకలకు సిద్ధమైంది. ముఖ మండపం, అంతరాలయం, వసంత మండపం ధ్వజస్తంభం, ప్రాకార మండపాలకు సువాసనలు వెదజల్లే వివిధ రకాల ఫల పుష్పాలతో ముస్తాబు చేస్తున్నారు. వివిధ రకాల పూలతో నూతన సంవత్సర వేడుకలకు స్వాగతం పలుకుతూ అందంగా తీర్చిదిద్దారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చే భక్తులకు స్వామివారి దర్శనం అందించే ఏర్పాట్లు చేపడుతున్నారు. న్యూయర్ వేడుకలకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్య చక్రధరరావు ఏర్పాట్లు చేపడుతున్నారు. వాడవాడలా ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి వేడుకలకు శ్రీకారం చుట్టారు. ఇళ్ల వద్ద 2024కు వీడ్కోలు పలుకుతూ 2025కు స్వాగతం పలుకుతూ వేసిన ముగ్గులు విశేషంగా ఆకట్టుకున్నాయి.



కడియం పూల మార్కెట్‌కు కళ

విక్రయాల జోరు

కడియం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): కడియం మండలం కడియపులంక అంతరాష్ట్ర పూలమార్కెట్‌కు నూతన సంవత్సర శోభ సంతరించుకుంది. కొనుగోలుదారులు, రైతులు, వ్యాపారులతో మార్కెట్ కళకళలాడింది. పువ్వులు, దండలు కొనుగోలుదారులతో మార్కెట్‌లో సందడి నెలకొంది. ఒక్కసారిగా విక్రయాలు ఊపందుకోవడంతో వ్యాపారులు ఆనందం వ్యక్తం చేశారు..



కొవ్వూరు పట్టణంలో బిర్యానీ సెంటర్

ఘుమఘుమలు

మార్కెట్‌లో పసందైన వంటలు తయారు చేసి అమ్మకాలు సాగించే దుకాణాల వద్ద రద్దీ ఏర్పడింది. ఘుమఘుమలాడే వివిధ రకాలను యువతకు అందుబాటులో ఉంచారు..





కడియం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): శ్రీ సత్యనారాయణ నర్సరీ గార్డెన్స్ - పల్ల గణపతి నర్సరీలో నూతన సంవత్సరం సందర్భంగా వివిధ రకాల పూలు, మొక్కలతో '2025-హ్యాపీ న్యూఇయర్' అంటూ కూర్పు చేశారు. ఈ సందర్భంగా శ్రీసత్యనారాయణ నర్సరీ గార్డెన్స్ అధినేత పల్ల గణపతి మాట్లాడుతూ నర్సరీకి వచ్చే సందర్శకుల కోసం ఈ రకం కూర్పు చేశామని, ఈ నెల 20 వరకు ప్రదర్శన ఉంటుందని చెప్పారు.

విద్యుదాఘాతంతో జోడెద్దులు మృతి



సంఘటనా స్థలంలో మృతిచెందిన ఎద్దులు, ఎద్దులకు సంస్కారాలు చేస్తున్న దృశ్యం(ఇన్‌సెట్లో)

రాజానగరం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఎడ్ల బండిపై తరలిస్తున్న బడ్డీ కొట్టు జోడెద్దుల పాలిట మృత్యువు రూపంలో కబళించింది. ఈ సంఘటనలో ఎడ్ల బండి యజమానితో పాటు మరో రైతు ప్రాణాలతో సురక్షితంగా బయట పడ్డారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం నరేంద్రపురం గ్రామానికి చెందిన ప్రగడ సుబ్రహ్మణ్యం అనే రైతు పశు సంపదనే నమ్ముకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో తన పొలం చెంతన ఉన్న వెలుగుబంద గ్రామానికి చెందిన మరో రైతు దారా ఏసుబాబు మాట మేరకు వెలుగుబంద నుంచి బడ్డీ కొట్టును ఎడ్ల బండిపై కాటవరం తరలించేందుకు ఒప్పుకున్నాడు. సుబ్రహ్మణ్యం పగ్గాలు పట్టుకుని ఎడ్ల బండి ముందు నడుస్తుండగా, ఏసుబాబు తొట్టిలో కూర్చుని బండి తోలుతున్నాడు. మరికొద్ది సేపటికి గమ్యస్థానం చేరుకుంటామన్న తరుణంలో మిర్తిపాడు సమీపానికి వెళ్లేసరికి ఎదురుగా వస్తున్న మోటార్‌సైకిల్‌కు దారి ఇచ్చేందుకు ఎడ్ల బండిని రోడ్డు పక్కకు మలిచాడు. ఈ సమయంలో రోడ్డు పక్కన కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలు బడ్డీ కొట్టుకు అమర్చిన ఇనుప రేకులకు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై రెండు ఎద్దులు అక్కడికక్కడే మృతిచెందాయి. ఎడ్ల బండిపై ఉన్న ఏసుబాబుకు స్వల్ప గాయాలు కావడం గమనించిన సుబ్రహ్మణ్యం తొట్టిలో కూర్చున ఏసుబాబును చొక్కా కాలర్ పట్టుకుని కిందికి లాగేయడంతో ప్రాణాలతో సురక్షితంగా బయట పడ్డాడు. మృతిచెందిన ఎద్దులకు నరేంద్రపురంలోని రైతు పొలంలో సంస్కారాలు చేపట్టారు. కళ్లెదుటనే ఎద్దులు విలవిలా కొట్టుకుని మరణించడంతో సుబ్రహ్మణ్యం బోరున విలపించాడు.

దొంగతనాల కేసుల్లో ముగ్గురు నిందితుల అరెస్టు

రూ.23లక్షల 30వేల సొత్తు రికవరీ

ముమ్మిడివరం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): వేర్వేరు జిల్లాల్లో పలు దొంగతనాల కేసులకు సంబంధించి ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి రూ.23లక్షల 30వేలు సొత్తును రికవరీ చేశారు. ఈ వివరాలను అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ ముమ్మిడివరం సీఐ కార్యాలయంలో మంగళవారం రాత్రి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరించారు. ఏడు కేసులకు సంబంధించి వివిధ జిల్లాలకు చెందిన ముగ్గురు నిందితులను ముమ్మిడివరం మండలం అన్నంపల్లి పంచాయతీపరిధిలోని లక్ష్మీదేవి లంక సమీపంలో మంగళవారం ముమ్మిడివరం సీఐ ఎం.మోహన్ కుమార్, ఎస్ ఐ.జ్వాలాసాగర్, సిబ్బంది నిందితులను అరెస్టుచేసినట్టు తెలిపారు. కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం వడ్డిచెరువుకు చెందిన ఓలేటి మహాలచ్చారావు, పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ మండలం చిన్నమల్లం గ్రామానికి చెందిన గెద్దాడ సురేంద్ర, పశ్చిగోదావరి జిల్లా తణుకు మండలం లక్ష్మీదేవి థియేటర్ వెనక మందారపువీధికి చెందిన పొట్టుపోతుల ఉదయ్‌కుమార్‌లను అరెస్టుచేసి వారి నుంచి 277.1 గ్రాముల బంగారం, 1.215 కిలోల వెండి, 2 మోటారు సైకిళ్లు, మూడు సెల్‌ఫోన్లు, మొత్తం రూ.23లక్షల 30వేల సొత్తును రికవరీ చేశారు. వారిపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం పోలీసుస్టేషన్‌లో రెండు కేసులు, అయినవిల్లి పోలీసుస్టేషన్‌లో ఒక కేసు, పామర్రు పోలీసుస్టేషన్‌లో ఒక కేసు, ఏలూరుజిల్లా చేబ్రోలు పోలీసుస్టేషన్‌లో ఒక కేసు, ఉండ్రాజవరం పోలీసుస్టేషన్‌లో ఒక కేసు, పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ పోలీసుస్టేషన్‌లో ఒక కేసు మొత్తం ఏడు కేసులు నమోదయ్యాయి. ఓలేటి మహాలచ్చారావు అలియాస్ మహా పలు నేరాల్లో పోలీసులకు పట్టుబడి 2024 జూలై వరకు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో శిక్ష అనుభవించి వచ్చాడని, అతడిపై పలు పోలీసుస్టేషన్లలో చాలా దొంగతనాల కేసులు నమోదై ఉన్నాయని అన్నాడు. గెద్దాడ సురేంద్ర అలియాస్ సూర్య 2023 ఫిబ్రవరి నుంచి జూన్ 2024 వరకు మండపేట పోలీసుస్టేషన్ పరిధిలో కేసులో నమోదై రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో శిక్ష అనుభవించి వచ్చాడని, అతడిపై పలు పోలీసుస్టేషన్‌లో దొంగతనాల కేసులు నమోదై ఉన్నాయన్నారు. పొట్టుపోతుల ఉదయ్‌కుమార్ అలియాస్ ఉదయ్ కూడా దొంగతనాలు చేశాడు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసు సిబ్బందిని టీఎస్ఆర్కే ప్రసాద్ ఆధ్వర్యంలో ముమ్మిడివరం సీఐ ఎం.మోహన్‌కుమార్, ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలాసాగర్, సిబ్బందిని ఎస్పీ బి.కృష్ణారావు అభినందించారు.



రికవరీ సొత్తును విలేకర్లకు చూపుతున్న పోలీసులు

నకిలీ కరెన్సీ కేసులో ఇద్దరి నిందితుల అరెస్టు



రాజోలు పోలీసుస్టేషన్‌లో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్

రాజోలు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నకిలీ కరెన్సీ కేసులో పరారీలో ఉన్న ఇద్దరు నిందితులను అరెస్టు చేశామని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా రాజోలు సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరారీలో ఉన్న ఇద్దరు నిందితులైన కృష్ణాజిల్లా బాపులపాడుకు చెందిన ఎస్.సత్యనారాయణ, ఐ.పోలవరం మండలం కొమరగిరికి చెందిన జె.శ్రీనివాస్‌ను ముందుగా అందిన సమాచారం మేరకు రావులపాలెం మండలం పూజారిపాలెం వద్ద అదుపులోకి తీసుకుని అరెస్టు చేశామని తెలిపారు. వారి వద్ద నుంచి రూ.500 నోట్లు 4 నకిలీ కరెన్సీ నోట్లు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు. ఇద్దరు నిందితులను కొత్తపేట కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండు విధించినట్టు సీఐ నరేష్‌కుమార్ తెలిపారు. సమావేశంలో రాజోలు ఎస్ఐ బి.రాజేష్‌కుమార్, సిబ్బందిని సీఐ నరేష్‌కుమార్ అభినందించారు.


మా ఖాతాదారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు
నూతన సంవత్సర శుభాకాంక్షలు 2025
శ్రీ మణిజ్యోతి టెక్స్‌టైల్స్
షాపు నెం.6,7. కర్రి సూరారెడ్డి కాంప్లెక్స్, దానవాయిపేట
రాజమహేంద్రవరం, ఫోన్:2441274, సెల్:9848224799

నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు
ఫైర్ హైడ్రెంట్ వర్క్స్ అందుబాటు ధరలో
NBC 2016 అనుసరించి
గత 18 సం॥లుగా మమ్ములను ఆదరిస్తున్న మా కస్టమర్లకు, వినియోగదారులకు, మిత్రులకు మరియు శ్రేయోభిలాషులకు నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలతో...
పి. నరేష్‌కుమార్ చెరుకుపల్లి
A member of FSAI amaravathi chapter
FSAI
CJRL FIRE & SAFETY SERVICES
D.No. 2-29, MIG-29, Shop No.2, APHB Colony, Lalacheruvu,
RAJAHMUNDRY-3. Cell: 98484 51381, 98480 51381
email : cjrl.fire@gmail.com web : www.cjrlfire.com

పీఎస్ఎల్వీ-సీ60 నమూనాలో విద్యార్థినులు



రాజానగరం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలోని దివ్య విద్యాసంస్థల విద్యార్థినులు పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్ విజయవంతం నేపథ్యంలో భారత అంతరిక్ష పరిశోధన సంస్థకు నూతన సంవత్సర శుభాకాంక్షలను రాకెట్ నమూనాలో ఏర్పడి తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల వైస్ చైర్మన్ బర్ల విజయ్ విద్యార్థులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

ఎఫ్ఎల్ఎన్‌తో విద్యాబోధనలో నూతన ఒరవడి

● శిక్షణాకేంద్రం కోర్స్ కోఆర్డినేటర్ రాంబాబు ● శిక్షణ పొందిన 330 మంది ఉపాధ్యాయులు



ప్రతిభ కనబరచిన ఉపాధ్యాయులకు జ్ఞాపికలు అందజేస్తున్న రాంబాబు

దివాన్‌చెరువు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): విద్యాబోధనలో ఫౌండేషన్ న్యూమరసీ లిటరసీ(ఎఫ్ఎల్ఎన్) నూతన ఒరవడి సృష్టిస్తుందని శిక్షణాకేంద్రం కోర్స్ కోఆర్డినేటర్ బి.రాంబాబు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం కొండగుంటూరులోని సత్యసాయి పరిమళ పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న ఆరో బ్యాచ్ శిక్షణా కార్యక్రమం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల స్థాయి ఆధారంగా విద్యాబోధన చేసినప్పుడే వారి అభ్యసనాస్థాయి పెరుగుతుందన్నారు. ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలల్లో ఒకటో తరగతి విద్యార్థి స్థాయికి అనుగుణంగా బోధన సాగాలని పిలుపునిచ్చారు. పాఠశాల స్థాయిలో ఒకటో తరగతి విద్య పునాదిగా ఉంటుందని చెప్పారు. విద్యార్థికి భాష, గణితంలో అవసరమైన ప్రాథమిక పరిజ్ఞానాన్ని అందించాల్సిన అవసరం ఉందన్నారు. డైట్ అధ్యాపకురాలు ఎం.జానకీదేవి, ఎంఈవో సీహెచ్‌డీ జోమిరెడ్డి, ప్రథమ్ జిల్లా కోఆర్డినేటర్ జి.అనూష మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ఓర్పు, సహనం ఆభరణాలుగా ఉండాలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలపై సమాజంలో నమ్మకం కలిగించేలా బోధన చేయాలని అన్నారు. ఆ విషయాన్ని ఉపాధ్యాయులు అవగాహన చేసుకుని వచ్చే విద్యాసంవత్సరానికి ముందే ఎన్‌రోల్‌మెంట్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని తెలిపారు. ఎఫ్ఎల్ఎన్ శిక్షణను సద్వినియోగం చేసుకుని విద్యార్థుల అభ్యసనా స్థాయి పెరిగే విధంగా బోధన చేపట్టాలని సూచించారు. సమావేశంలో కేఆర్పీలు ఈశ్వర్, గౌతమ్‌కృష్ణ మాట్లాడారు. తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ, అల్లూరిసీతారామరాజు జిల్లాలకు చెందిన 330 మంది ఉపాధ్యాయులు శిక్షణ పొందారని రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా టీఎల్ఎంలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన ఉపాధ్యాయులకు జ్ఞాపికలు అందజేశారు.

రూ.20 నోటు పడిందని చెప్పి...

యానాంలో ఆరు ఫోన్లు చోరీ



యానాం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): రూ.20 నోటు పడిందని చెప్పి సుమారు 6ఫోన్లు చోరీ చేసిన సంఘటన మంగళవారం సాయంత్రం యానాంలో జరిగింది. కొందరు దొంగలు ఇదే పనిగా తిరుగుతున్నారు. మంగళవారం సాయంత్రం యానాంలో రద్దీగా ఉండే ప్రాంతాల్లో, సీసీ కెమెరాలు లేని చోట్లు దొంగలు తిరుగుతూ మీ రూ.20 నోటు జోబులోంచి పడిందని చెప్పి అది తీసుకునే సమయంలో వారితో మాటలు కలిపి వారికి తెలియకుండా జేబులో ఉన్న ఫోన్‌ను అపహరిస్తున్నారు. అది గమనించే సమయానికి వారు అక్కడ నుంచి ఉడాయిస్తున్నారు. 2గంటల వ్యవధిలోనే ఈ సంఘటనలు జరిగాయి. ఒకరి తరువాత మరొకరు సుమారు ఐదుగురు బాధితులు ఫోన్లు అపహరణకు గురైనట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై వారు విచారణ నిర్వహిస్తున్నారు.

కానిస్టేబుళ్ల ఎంపికకు...

కొనసాగిన దేహదారుఢ్య పరీక్షలు

కాకినాడ క్రైం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుళ్ల నియామక ఎంపిక ప్రక్రియలో భాగంగా అభ్యర్థులకు కాకినాడ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో దేహదారుఢ్య పరీక్షలు రెండో రోజైన మంగళవారం కూడా కొనసాగాయి. 277 మంది హాజరు కాగా తదుపరి పరీక్షకు 184 మంది అర్హత సాధించారు. ఈ ప్రక్రియను ఎస్పీ విక్రాంత్‌పాటిల్ పర్యవేక్షించారు.



పరుగు పందెంలో పాల్గొన్న అభ్యర్థులు



లాంగ్ జంప్ చేస్తున్న అభ్యర్థి

బాల్యవివాహం చట్టరిత్యా నేరం: కలెక్టర్

దివాన్‌చెరువు, డిసెంబరు31 (ఆంధ్రజ్యోతి) : బాల్యవివాహం జరిపించడం, వాటిని ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మంగళవారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి భాగస్వామ్యం అయ్యే వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. మండలంలోని కొత్తతుంగపాడులో జరిగిన బాల్యవివాహం ఘటనపై కలెక్టర్ స్పందించి తక్షణ చర్యలకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో జిల్లా బాలల సంరక్షణాధికారి రాజ్‌కుమార్ క్షేత్రస్థాయిలో పరిశీలన చేసిన సందర్భంలో గ్రామానికి చెందిన యువకుడి(27)కి అదే గ్రామానికి చెందిన బాలికతో వివాహం జరిగిందనే విషయం విచారణలో నిర్ధారణ చేసుకున్నామన్నారు. కొత్తతుంగపాడు బాల్యవివాహం కేసుపై ఈ నెల 28న రంగంపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశామని జిల్లా బాలల సంరక్షణాధికారి రాజ్‌కుమార్ వెల్లడించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టినట్టు పేర్కొన్నారు.

ఆడపిల్లల సంపూర్ణ వికాసానికి కృషి


సీతానగరంలో కిషోర్ వికాస్‌పై అవగాహన కార్యక్రమం

సీతానగరం, డిసెంబరు31 (ఆంధ్రజ్యోతి): కిషోరి వికాష్ కార్యక్రమంలో భాగంగా 11 నుంచి 18 సంవత్సరాల మధ్య ఉన్న ఆడపిల్లల సంపూర్ణ వికాసానికి అన్ని శాఖలు సమన్వయంతో కృషి చేయాలని ఎంపీడీవో భారతి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కిషోరి వికాస్ కార్యక్రమంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 11 నుంచి 18 ఏళ్ల మధ్య ఆడపిల్లలు శారీరకంగా, మానసికంగా, నైతికంగా, ఆరోగ్యపరంగా పరిపూర్ణంగా ఎదగడానికి గ్రామంలో ఉన్న అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, తల్లిదండ్రులు, స్వచ్ఛంద సంస్థలు సమష్టిగా రక్షణ కల్పించాలన్నారు. అలాగే వారికి ప్రోత్సాహం, అవగాహన కల్పించి వారు ఆదర్శ యువతులుగా ఉండేటట్టు కృషి చేయాలన్నారు. పీహెచ్‌సీ డాక్టర్ ఏవీకే చైతన్య మాట్లాడుతూ గ్రామాల్లో పది నుంచి పదిహేను మంది కిషోరి బాలికలను ఒక్కొక్క గ్రూపుగా సమీకరించి వారికి పౌష్టికాహారం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. ఏపీవో కె.నాగశేషవేణి మాట్లాడుతూ ఆడపిల్లకు 19 ఏళ్లు నిండిన తరువాత మాత్రమే వివాహం చేయాలన్నారు. బాల్యవివాహాలు చేసిన కుటుంబాలకు కౌన్సిలింగ్ ఇచ్చి బాల్య వివాహాల నియంత్రణపై చైతన్యం తీసుకురావాలన్నారు.. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, ఈవోపీఆర్డీ వైవీఎస్ఎస్ మూర్తి, ఏపీఎం జిలాని, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు వరలక్ష్మి, ఇందిరా భారతి పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పడిపోయినది

రాజమహేంద్రవరం మాయ బజార్ డో.నెం.32-4-25లో గల మా ఇంటి నుండి దివ్యరాజ్ రమన్‌లాల్ కంకు చోప్రా S/o రమన్ లాల్ చోప్రా పాస్‌పోర్ట్ నెం.PO633588 అనే నెంబర్ గల పాస్‌పోర్ట్ మాయాబజార్ గల మా ఇంటినుండి జిరాక్స్ నిమిత్తం మెయిన్‌రోడ్‌కి వెళ్తుండగా అదే దారిలో పడిపోయినది. మరలా అదే మార్గంలో ఎంత వెతికినా దొరకలేదు. కావున ఈ పాస్‌పోర్ట్ ఎవరికైనా దొరికినచో సమాచారం ఇవ్వగలరని ఆశిస్తూ...

దివ్యరాజ్ రమలాల్ కంకు చోప్రా
S/o రమన్‌లాల్ చోప్రా
డోరు నెం. 32-4-25, మాయాబజార్, రాజమహేంద్రవరం
Cell: 8019141102

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

కోరుకొండ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కోరుకొండలో శ్రీ సరస్వతి విద్యానికేతన్‌లో మంగళవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు శాంతాక్లాస్, ఏంజిల్ వేషధారణలో అలరించారు. ఏసు గొప్పతనాన్ని ఆయన బోధనలను చిన్నారులకు వివరించారు. పలువురు విద్యార్థులు ఏసు కీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పెనకటి గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

పీఎం ఆవాస కాలనీలకు జగన్ పేరా!

- ఎరువుల కొరత ఉన్నా ఎందుకు ఇండెంట్‌లు పెట్టలేదు
- ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి
- వాడి వేడిగా బిక్కవోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం


బిక్కవోలులో పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

బిక్కవోలు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రధాన మంత్రి ఆవాస యోజనలో కట్టిన ఇళ్ల కాలనీలకు జగనన్న కాలనీలుగా పేర్లు పెడుతుంటే తొలగించకుండా హౌసింగ్ అధికారులు ఏం చేస్తున్నారని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. బిక్కవోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ బుద్దాల కన్నారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఇళ్లకాలనీ పేర్లపై ఏఈ వనమయ్యను ప్రశ్నించగా ఆయన నాకు సంబంధం లేదని తెలపడంతో ఎమ్మెల్యే ఆయనపై మరింత ఆగ్రహం వ్యక్తంచేశారు. పంచాయతీ, రెవెన్యూ, హౌసింగ్ శాఖల ప్రమేయం లేకుండా అక్కడ ఎలా ఇళ్లు నిర్మించారని ప్రశ్నించారు. మూడు శాఖలు సమన్వయం చేసుకుని వెంటనే ఏ నిధులతో ఇళ్లు నిర్మించారో దానికి సంబంధించిన బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే మండలంలో ఎరువుల కొరత ఉన్నా ఎందుకు ఇండెంట్‌లు పెట్టలేదని వ్యవసాయశాఖాధికారులను నిలదీశారు. బస్తాకు రూ.100 ఎక్కువ పెట్టి రైతులు బ్లాక్‌లో కొంటున్నారన్నారు. దీంతో సహాయ వ్యవసాయాధికారి భాస్కరరెడ్డి మండలానికి 2200 టన్నుల యూరియా, డీఏపీ 760, కాంప్లెక్స్ ఎరువులు 800 టన్నులు అవరసమౌతయాని ఇండెట్లు పెడుతున్నామని తెలిపారు. ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్యను పెంచాలని ఆశా ఖ అధికారులకు సూచించారు. ఇరిగేషన్ ఏఈ నాగేశ్వరరావు మండలంలో కాలువల పూడికతీత, స్లూయిజ్‌ల మరమ్మతులకు రూ.74 లక్షలతో ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారు. కాకినాడ-రాజమహేంద్రవరం రోడ్డులో బిక్కవోలు నుంచి అనపర్తి వరకూ రూ.25 కోట్లు, పందలపాక-జి. మామిడాడ రోడ్డుకు రూ.10 కోట్లతో అభివృద్ధి చేసేందుకు నాబార్డుకు ప్రతిపాదనలు పంపినట్లు ఆర్అండ్‌బీ ఏఈ రాంబాబు సభకు వివరించారు. ముందుగా ఎమ్మెల్యే.. మాజీ ప్రధాని మన్మోహన్ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రొంగల పద్మావతి, మండల ప్రత్యేకాధికారి విజయకుమారి, తహశీల్దార్ సత్యకృష్ణ, ఎంపీడీవో వి.శ్రీనివాస్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ.. మండలంలో నూతనంగా మంజూరైన ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మంగళవారం కూటమి నేతలతో కలసి పంపిణీ చేసారు. ఈసందర్భంగా ఆయన 15 మందికి వితంతువులకు పింఛన్లను పంపిణీ చేసారు. రావాడ నాగు, పల్లి శ్రీనివాసరెడ్డి, పడాల సూర్యనారాయణరెడ్డి, కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, తొండాపు సురేష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించండి

రంగంపేట, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి):స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి అధ్యతన జరిగిన సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విచ్చేసి మాట్లాడారు. ముందుగా మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. గత ప్రభుత్వ హయాంలో అనపర్తి నియోజకవర్గం అభివృద్ధిలో చాలా వెనుకబడి ఉందని జడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీలు అందరూ పార్టీలకు అతీతంగా ప్రభుత్వానికి సహకరించి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన భూసర్వేలో తలెత్తిన తప్పిదాలను సరిచేయడానికే కూటమి ప్రభుత్వం భూ రీసర్వే కార్యక్రమం చేపట్టిందన్నారు. రైతుల భూసమస్యలను పరిష్కరించడానికి అధికారులు కృషిచేయాలన్నారు. అందరికీ ముందుస్తు నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు చెప్పారు. సమావేశంలో జడ్పీటీసీ పేపకాయల రాంబాబు, కోఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, ఎంపీడీవో వీవీ సాయిబాబు, తహశీల్దార్ కోసు అనసూయ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పింఛన్ల అందజేత

ఇదిలా ఉండగా కార్యాలయం వద్ద ఏడుగురికి నూతనంగా మంజూరైన పింఛన్లలను పంపిణీ చేశారు. వలంటీర్లు లేకుండా పింఛన్ల పంపిణీ కుదరదని గత ప్రభుత్వం చెప్పిందన్నారు. కాని ఇప్పుడు వలంటీర్లు లేకుండానే సచివాలయ, ఇతర ఉద్యోగులతో ఒక రోజు ముందుగానే ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు.

అనపర్తి: ఇటీవల భర్తలను కోల్పోయిన మండల పరిధిలోని 12మంది వితంతువులకు మంజూరైన పింఛన్లను రామవరం పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నల్లమిల్లి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అలాగే సంక్రాంతి సందర్భంగా పారిశుధ్య కార్మికులకు దుస్తులను అందజేశారు. తదుపరి పొలమూరులో మానసిక దివ్యాంగురాలు సత్తి వెంకటలక్ష్మికి రూ.6వేల నుంచి 15వేలకు పెంచిన పించన్‌ను ఆమె ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.రామకృష్ణారెడ్డి సర్పంచ్ గిరిడా గంగాభవాని, తేనెల శ్రీనివాస్, చింతా సురేష్‌రెడ్డి, జీవీరెడ్డి పాల్గొన్నారు.

మానవ మనుగడకు విజ్ఞానశాస్త్రమే మూలం

మండల స్థాయిలో వైజ్ఞానిక ప్రదర్శనలో కడియం ఎంఈవో నాగేశ్వరరావు


వైజ్ఞానిక ప్రదర్శను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

కడియం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మానవ మనుగడకు విజ్ఞాన శాస్త్రమే మూలమని, విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలని ఎంఈవో కె.నాగేశ్వరరావు అన్నారు. కడియం ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో సదరన్ ఇండియా సైన్సు ఫెయిర్ కార్యక్రమం హెచ్ఎం టి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. మండలంలో 9 ఉన్నత, రెండు ప్రాథమికోన్నత పాఠశాలలు ఈ సైన్సుఫెయిర్‌లో పాల్గొని సుమారు 30 అంశాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి సంధానకర్తగా గొల్లపల్లి సత్యనారాయణ, న్యాయమూర్తులుగా ఎంఈవో నాగేశ్వరరావు, హెచ్ఎం సత్యనారాయణ వ్యవహరించారు. ప్రథమస్థానం పొందిన వారు జిల్లాస్థాయి పోటీలకు హాజరు కావాలని ఎంఈవో తెలిపారు.

● విద్యార్థుల వ్యక్తిగత విభాగంలో కృష్ణచైతన్య (దుళ్ల) ప్రథమ, జి.మణికంఠగుప్త (వేమగిరి) ద్వితీయస్థానాలు పొందారు. బృందం విభాగంలో బి మణికంఠ, ఫణీంద్ర (జేగురుపాడు) ప్రథమ, ఎం.పవిత్ర, ఎం.ఐశ్వర్య (కడియం) ద్వితీయ స్థానాలు, టీచర్ విభాగంలో జీఎస్ఎన్ మూర్తి (వీరవరం) ప్రథమ, ప్రకాష్ (వేమగిరితోట) ద్వితీయ స్థానాలు పొందారు.

జాతీయ వాలీబాల్ పోటీలకు సుధీర్‌కుమార్


సుధీర్‌కుమార్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే

బిక్కవోలు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): బిక్కవోలుకు చెందిన సత్రపు సుధీర్‌కుమార్ సీనియర్ జాతీయ వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బిక్కవోలు మండల పరిషత్ కార్యాలయంలో సుధీర్‌ను సత్కరించారు. సుధీర్ ఈనెల 7నుంచి 13 వరకూ రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగే జా తీయ పోటీల్లో రాష్ట్రం తరఫున పాల్గొంటాడని జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయ సం ఘ అధ్యక్షుడు యార్లగడ్డ బంగార్రాజు తెలిపారు. కార్యక్రమంలో పల్లి శ్రీనివాసరెడ్డి, తొండాపు సురేష్ కుమార్‌రెడ్డి, పీడీలు రాఘవరెడ్డి, పడాల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

4న వేమగిరిలో గేమ్‌చేంజర్ ప్రీరిలీజ్ ఈవెంట్

కడియం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఈనెల 4న సాయంత్రం వేమగిరి జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న గ్రౌండ్‌లో గేమ్ చేంజర్ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్ జరుగుతుందని అవుతుందని రాష్ట్ర చిరంజీవి యువత ప్రధాన కార్యదర్శి ఏడిద బాబి తెలిపారు. దీనిలో భాగంగా మంగళవారం సాయంత్రం టీడీపీ మహానాడు నిర్వహించిన మైదానాన్ని ఏ మీడియా చైర్మన్ నరేంద్ర వచ్చి పరిశీలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ముఖ్యఅతిథిగా విచ్చేస్తారన్నారు. అలాగే హీరో రామ్‌చరణ్, హీరోయిన్ కియారా అద్వానీ, దర్శకుడు శంకర్, నిర్మాత దిల్‌రాజు, సంగీత దర్శకుడు తమన్ పాల్గొంటారని తెలిపారు. అభిమానుల తాకిడిని తట్టుకునేలా ఎక్కడికక్కడ పగడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు.

వేంకటేశ్వర స్వామికి పూరాభిషేకం

కోరుకొండ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కోరుకొండలో శ్రీ భూ సమేత వేంకటేశ్వర స్వామికి మంగళవారం పంచామృతాలతో పూరాభిషేకం నిర్వహించారు. వేద పండితులు వేద మంత్రాలు పఠిస్తు ఉండగా ఆలయ ప్రధానార్చకుడు మిరియాల శేషుకుమార్ స్వామి వారికి పూరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా 108 కలశాలతో ఏర్పాటు చేసిన పవిత్రజలాలతో స్వామి వారి అభిషేకం కన్నుల పండుగగా జరిగింది. కార్యక్రమంలో పసుపులేటి రెడ్డమ్మ, బొండాడ చందు, నల్లమిల్లిసత్తిబాబు, నిడమనూరి వెంకట ఆదినారాయణ, అడపా సురేష్, మహిళలు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దు

అనపర్తి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : చెడు వ్యసనాలకు బానిసలై తమ జీవితాలను పాడు చేసుకోవడమే కాకుండా తల్లిదండ్రులను శోకం మిగిల్చే సంస్కృతిని యువత వీడాలని ఎస్ఐ శ్రీను నాయక్ అన్నారు. మంగళవారం అనపర్తిలోని స్వామి వివేకానంద సెంటర్‌లో కళాశాలల విద్యార్థులతో మద్యపానం, ధూమపానం, జూదం వంటి వ్యసనాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గ్రామ వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ యువతలో చైతన్యం రావాలని కేవలం తమ లక్ష్యంపై దృష్టి సారించి గమ్యానికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఏఎస్ఐ రుద్రరాజు, జీబీఆర్, ఎమ్ఎస్ఆర్ కళాశాలల విద్యార్థులు అధ్యాపకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గజ వాహనంపై విహరించిన శ్రీనివాసుడు

బిక్కవోలు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): బలభద్రపురంలోని శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరుని ద్వితీయ బ్రహ్మోత్సవాలు మంగళవారం ఎనిమిదో రోజుకు చేరాయి. ఈసందర్భంగా ఉదయం సుప్రభాత సేవ, చందనోత్సవం, కేశవాది వ్రతం, సాయంత్రం డోలోత్సవం నిర్వహించారు. స్వామి దర్శనానికి వచ్చిన భక్తులందరికీ ఆలయ కమిటీ చైర్మన్ మల్లిడి గంగారెడ్డి అన్నప్రసాద ఏర్పాట్లు చేశారు. రాత్రి స్వామి అమ్మవార్లు శ్రీవేంకటాచలపతి అవతారంలో గజ వాహనంపై మాడవీధుల్లో విహరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారి వాహనం లాగడానికి పోటీ పడ్డారు.

ప్రాచీన ఆలయాలను దర్శించిన కాకినాడ అసిస్టెంట్ కలెక్టర్ భావన

బిక్కవోలులోని ప్రాచీన ఆలయాలను కాకినాడ జిల్లా అసిస్టెంట్ (ట్రైనీ) కలెక్టర్ భావన దర్శించారు. ముందుగా ఆమె లక్ష్మీ గణపతిని దర్శించి అనంతరం గోలింగేశ్వర, కుమార సుబ్రహ్మణ్యస్వామి వార్లను దర్శించారు. ఆలయాల ఈవో ఆకెళ్ల భాస్కర్ ఆమెకు వేద ఆశీర్వచనాలు అందజేసి సత్కరించారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి

పల్లెబాట. జనవాణి కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ


గోనగూడెంలో వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న బత్తుల, బీవీఆర్

రాజానగరం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. రాజానగరంలో మంగళవారం జనవాణి, పల్లెబాట కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి ఎమ్మెల్యేకు అర్జీలను సమర్పించారు. వీటిలో కొన్ని సమస్యలపై సంబంధిత అధికారులతో సంప్రదించి అక్కడికక్కడే పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టారు. ప్రధానంగా ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, పెన్షన్లు, వీధి లైట్లు తదితర సమస్యలపై వినతిపత్రాలు అందించారు. అలాగే దెబ్బతిన్న పంటలకు సంబంధించి నష్టం పరిహారం చెల్లించాలని, రోడ్లు, డ్రైనేజీ సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. అనంతరం స్థానిక గ్రామ సచివాలయం వద్ద నిర్వహిం చిన సభలో ఎమ్మెల్యే బత్తుల మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను సకాలంలో పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు. నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో అడుగులు వేస్తున్నామని, ఇందుకు అధికారులంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్య కర్తలు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

కోరుకొండ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిడిగట్ల, జంబుపట్నం, పశ్చిమగోనగూడెం, కోరుకొండ, కాపవరం, నర్సాపురం, గాదరాడ, కణుపూరు, తదితర గ్రామాల్లో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భర్త చనిపోతే వెంటనే ఆ పింఛను భార్యకు అందించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని చెప్పారు. నియోజకవర్గంలో మంచాన పడిన 63 మంది వృద్ధులకు ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున పింఛను అందజేశారు. గాదరాడ గ్రామంలో ఎమ్మెల్యే సతీమణి బత్తుల వెంకటలక్ష్మి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో గోనగూడెం సర్పంచ్ రొంగల దేవిక, కాపవరం సర్పంచ్ జాజుల రాము, జనసేన మండలాధ్యక్షుడు అడ్డాల శివ, నాయకులు కొయ్యా శామ్యూల్, మట్టా నాగేశ్వరరావు, ముక్కా రాంబాబు, కుంచి చల్లారావు, బొమ్ముల గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

రేవ్ పార్టీ కేసులో 13మందికి రిమాండ్

పరారీలో ఫంక్షన్ హాల్ యజమాని

కోరుకొండ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూరుగుపూడి రేవ్ పార్టీ కేసులో అరెస్టయిన 13 మందికి ఈ నెల 14 వరకు రిమాండ్ విధించారని కోరుకొండ సీఐ వై.సత్యకిషోర్ ఓ ప్రకటనలో తెలిపారు. వీరందరినీ రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించామన్నారు. మొత్తం ఈ రేవ్ పార్టీ కేసులో పోలీసులో 14 మంది పురుషులు, ఐదుగురి మహిళలపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఏ1గా ఉన్న ఫంక్షన్ హాల్ యజమాని సత్తి భామిరెడ్డి ఇప్పటికే పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. ఏ2గా సత్తిభామిరెడ్డి కుమారుడు రామిరెడ్డి కొయ్యాలపాడు(పశ్చిమగోదావరి), ఏ3 రంగేటిగోపాలకృష్ణ ఏటీ అగ్రహారం (గుంటూరు), ఏ4 నెక్కంటి సత్యనారాయణ మినిమించలిపాడు(పశ్చిమగోదావరి జిల్లా), ఏ5 రేఖపల్లి సూర్యనారాయణ అగస్తుపాలెం(పశ్చిమగోదావరి జిల్లా), ఏ6 అతుకూరి రామకృష్ణ హౌసింగ్ బోర్డు, పాలకొల్లు (పశ్చిమగోదావరి జిల్లా), కొమ్మిశెట్టి తేజస్వి సూర్యగణేష్, గుండిగూడెం, గోపాలపురం మండలం(తూర్పుగోదావరి జిల్లా), ఏ8 బొమ్ము కిశోర్‌బాబు కొవ్వూరుపాడు, గోపాలపురం మండలం (తూర్పుగోదావరి జిల్లా), ఏ9 కాకి లక్ష్మీనరసింహ అప్పాజీ ధవళేశ్వరం (తూర్పుగోదావరి జిల్లా), ఏ10గా గంజా శ్రీనివాసరావు ఆచంట గ్రామం (పశ్చిమగోదావరి జిల్లా), ఏ11 ఎండమల్లి లక్ష్మణరావు బెద్దేవం, తాళ్ళపూడి మండలం (తూర్పుగోదావరి జిల్లా), ఏ12 దొంగా శ్రీనివాస్ చిన్నపాలెం, యలమంచలి మండలం(అనకాపల్లి జిల్లా), ఏ13 నీలి వెంకట వినీల్, తాళ్ళూరు, గండేపల్లి మండలం (కాకినాడ జిల్లా), ఏ14 తందాసి వంశీ దోసకాయలపల్లి, కోరుకొండ మండలంగా కేసులు నమోదు చేశామని సీఐ సత్యకిశోర్ తెలిపారు.

బీజేపీ సీతానగరం అధ్యక్షురాలిగా వెంకటలక్ష్మి

సీతానగరం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షురాలిగా రాపాక వెంకటలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయినట్టు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్నచౌదరి ప్రకటించారు. మంగళవారం రాజమహేంద్రవరంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వెంకటలక్ష్మిని పార్టీ మండల అధ్యక్షురాలిగా ఎన్నుకున్నారు. అనంతరం ఆమెను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మద్దాల కొండలరావు, మట్టాడి వెంకటరమణ, బాలయోగి తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవానర్సరీని సందర్శించిన

ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ ప్రియాంక




కడియం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): కడియపులంక సత్యదేవా - పుల్లా చంటియ్య నర్సరీని మంగళవారం ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ప్రియాంక సందర్శించారు. ఆమెకు నర్సరీ అధినేత పుల్లా పెదసత్యనారాయణ మొక్కను అందజేసి స్వాగతించారు. నర్సరీలో వివిధ రకాల ఫల, పుష్ప, ఆర్నమెంటల్, ఇండోర్, ఔట్‌డోర్ మొక్కలను తిలకించారు. పర్యావరణ పరిరక్షణలో నర్సరీరైతుల కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ సిబ్బంది నాగిరెడ్డి రామకృష్ణ, సూరిబాబు తదితరులు ఉన్నారు.

కొంకుదురు హైస్కూల్లో న్యూఇయర్ వేడుకలు

బిక్కవోలు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): కొంకుదురు ఉన్నత పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ వివిధ రకాల ముగ్గులు వేసారు, ప్లేకార్డులు ప్రదర్శించారు. హెచ్ఎం మల్లిపూడి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





















Best Complete form

THE PRAKASAM NAGAR CO-OPERATIVE BUILDING SOCIETY LTD., NO.B-802
D.no.81-21-1/3, Godavari Towers
Sri Venkateswara Nagar, Rajamahendravaram

MANAGING COMMITTEE

Sri D.B. Venkatapathi Raju	President
Sri V. Bhasakar Ram	Vice President
Sri B. Syamala Rao	Director
Sri A.V. Narasimha Rao	Director
Sri M.Kesava Raju	Director
Sri K.Raja Prasad	Director
Sri K.V.Subba Rao	Director
Sri D.Subba Reddy	Director
Smt A.Gayatri	Director
Sri S.Rama Krishna	Secretary

Completed Ventures (Layouts)	Residential Flats
1. Prakasam Nagar, Block-1	Sai & Netaji Towers
2. Prakasam Nagar, Block-2	Godavari &
i) Sri Venkateswara Nagar	Gowtham Towers
ii) Sri Padmavathi Nagar	Vasista Residency
iii) Prakasam Nagar Block-3 Santhi Nagar	Balaji Towers
iv) Ram Nagar, Prakasam Nagar Block-4	

సందడే.. సందడి!



ఉత్సాహంగా.. ఉల్లాసంగా నూతన వేడుకలు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మంచిచేడుల కలబోతగా నిలిచిన 2024 ఏడాదికి జిల్లా ప్రజలు ఘనంగా వీడ్కోలు పలికారు. 2025 నూతన సంవత్సరంపై ఎన్నో ఆశలు, నమ్మకాలు, భవిష్యత్తుకు బాటలు వేసుకునే ఆలోచనలతో వైభవంగా స్వాగతించారు. 2024 జనవరి నుంచి డిసెంబరు వరకు తమ జీవితాల్లో వచ్చిన మార్పులు, ఆనంద సంఘటనలు ,వివాద అనుభవాలను ఒక్కసారిగా గుర్తుచేసుకుని ఏడాది బాగున్నవారు వచ్చే ఏడాది మరింత బాగుండాలని ,బాగోలేని వారికి వచ్చే ఏడాదైన పరిస్థితులు మారి జీవితాలు బాగుపడాలనే ఆశల నడుమ 2025కు స్వాగతం పలికారు. కూటమి ప్రభుత్వానికి విజయాన్ని అందించిన ఈ ఏడాదిపై ఆ పార్టీల నేతలు చాలా ఆనందమైన సంఘటనలు గుర్తుచేసుకున్నారు. విద్యార్థులు, యువత, వ్యాపారులు, గృహిణులు, నిరుద్యోగులు, కార్మికులు, కర్షకులు ఇలా అన్నిరంగాలకు చెందిన వారు సరికొత్త ఆశలతో కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టారు. రాజమహేంద్రవరంతో పాటు జిల్లావ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. డిసెంబరు 31 అర్ధరాత్రి 12వ గడియ ప్రవేశించగానే పెద్ద ఎత్తున యువత కేరింతలు కొడుతూ హ్యాపీ న్యూ ఇయర్ అంటూ బైక్‌లపై హల్‌చల్ చేస్తూ నూతన ఏడాదికి స్వాగతం పలికారు.పలు సెంటర్లలో కేక్‌లు కట్‌చేశారు. డిజే సాంగ్స్‌తో దుమ్ముదులిపేశారు.మహిళలు అయితే తమతమ ఇంటి ముంగిళ్లలో నూతన సంవత్సర రంగవల్లులతో అద్భుతంగా స్వాగతం పలికారు.





నల్లజర్లలో 2025కి స్వాగతం పలుకుతున్న మహిళలు



రాజమహేంద్రవరంలో బొకేలు కొనుగోలు చేస్తున్న బాలికలు

ఆన్‌లైన్‌లోనే శుభాకాంక్షలు..

నూతన సంవత్సరం వచ్చిందంటే రెండు దశాబ్దాల క్రితం అత్యంత ముఖ్యభూమిక పోషించేది గ్రీటింగ్ కార్డే, కానీ ఇప్పుడు నూతన ఏడాదికి ఇన్‌స్టా, ట్విట్టర్,ఫేస్‌బుక్, వాట్సాప్‌లు వేదిక అయ్యాయి. 2025 ను స్వాగతిస్తూ రకరకాలుగా వీడియోలను ఇన్‌స్టాలో ప్రజలు పోస్టు చేశారు.

కిక్కిరిసిన బార్‌లు, మద్యం షాపులు

రాజమహేంద్రవరం,కొవ్వూరు, అనపర్తి ,రాజానగరం, కోరుకొండ నిడదవోలు వంటి ప్రాంతాల్లో న్యూఇయర్ సందర్భంగా మందుబాబులతో బార్లు,మద్యం దుకాణాలు కిక్కిరిశాయి. ఉదయం నుంచి పెద్దఎత్తున మద్యం దుకాణాల వద్దకు యువత చేరుకుని అవసరమైన మద్యం బాటిళ్లను కొనుగోలు చేసుకున్నారు. బార్లలో అయితే అర్ధరాత్రి ఒంటి గంట వరకు సందడిగానే ఉన్నాయి. అర్ధరాత్రి 12 గంటల వరకు మద్యం షాపులలో అమ్మకాలు సాగాయి.

బేకరీలు, బిరియానీలకు డిమాండ్

నూతన ఏడాదికి స్వాగతం పలికేందుకు ప్రజలు కేక్‌ల దారి పట్టారు.నగరంలో బెంగళూరు బేకరీలపై పడ్డారు. ఉదయం 8 నుంచి రాత్రి 11 గంటల వరకు కేక్‌లు అమ్మకాలు చేశారు. అంతకంటే పెద్దఎత్తున స్వీట్ల కొనుగోళ్లు జరిగాయి.రూ.99కే చికెన్ బిర్యాని, బిర్యాని ప్లస్ రెండు థమ్సప్ బాటిల్, దమ్ బిర్యానీ, రూ.200 కే ఫ్యామిలీ ప్యాక్‌ల కోసం యువత పరుగులు పెట్టింది. స్వీట్లు, కేక్‌లు, కూల్ డ్రింక్స్, బిరియానీలతో న్యూఇయర్ వేడుకలు జరిగాయి.

ఏఆర్ హెచ్‌సీకి వీడ్కోలు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా పోలీస్ విభాగంలో పనిచేస్తూ పదవీ విరమణ పొందిన ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ జి. వెంకటేశ్వరరావు (1929)ని ఎస్పీ డి నరసింహకిశోర్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ ఎంబీఎన్ మురళీకృష్ణ శాలువాతో సత్కరించారు. వెంకటేశ్వరావు డిపార్టుమెంట్‌కు చేసిన సేవలను గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ చంద్రశేఖర్,ఆర్ఐ సంజీవ్ ,జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు రఘురాం ఇతర అధికారులు ,సిబ్బంది పాల్గొన్నారు.

టీఎన్‌యుఎస్ క్యాలెండర్ ఆవిష్కరించిన మంత్రి

రాజమహేంద్రవరం సిటీ,డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం (టీఎన్‌యుఎస్) 2025 క్యాలెండర్‌ను మంత్రి కందుల దుర్గేష్ మంగళవారం ఆవిష్కరించారు. మంత్రి క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో టీఎన్‌యుఎస్ రాష్ట్ర కార్యదర్శులు కంచెపు జయరాజు, రిమ్మలపూడి సత్యనారాయణ మూర్తి, జిల్లా గౌరవాధ్యక్షుడు లజపతిరాయ్, జిల్లా అధ్యకుడు ఉండవిల్లి సత్యనారాయణ ,ప్రధాన కార్యదర్శి డి సురేష్ కుమార్, సంఘం సలహాదారులు కొత్తపల్లి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.ఏపీ ప్రధానోపాధ్యాయుల సంఘం నూతన సంవత్సర డైరీని మంత్రి దుర్గేష్ ఆవిష్కరించారు.



రాజమహేంద్రవరంలో నిరసన ప్రదర్శన చేస్తున్న న్యాయవాదులు

న్యాయవాదుల నిరసన ప్రదర్శన

సీఐను డిస్మిస్ చేయాలని డిమాండ్

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): అనంతపూర్ న్యాయవాది శేషాద్రి గుండెపోటుతో మృతిచెందడానికి కారకుడైన సీఐపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రాజమహేంద్రవరంలో న్యాయవాదులు నిరసన ప్రదర్శన ,ధర్నా చేశారు. రాజమండ్రి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. బార్ అసోసియేషన్ నుంచి గోకవరం బస్టాండ్ మీదుగా సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేశారు. మధ్యలో గోకవరం బస్టాండ్ సెంటర్‌లో మానవహారం చేశారు. అనంతరం సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తవ్వల వీరేంద్రనాథ్ మాట్లాడుతూ న్యాయవాది శేషాద్రి మృతికి కారకులైన సీఐను డిస్మిస్ చేయాలని , న్యాయవాది కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ నాగదేవర స్వర్ణపాప , జనరల్ సెక్రటరీ పెళ్ళూరి రమేష్, ట్రెజరర్ కర్ర హనుమంతరావు, జాయింట్ సెక్రటరీ ధర్నాలకోట వెంకటేశ్వరావు, స్పోర్ట్స్ సెక్రటరీ కాశి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోండి

క్యాన్సర్ బాధిత మహిళకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి సాయం

రాజమహేంద్రవరంసిటీ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): తీవ్రమైన క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న రాజమహేంద్రవరానికి చెందిన కోన శ్రీవిద్యకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సహాయం చేశారు. తన కార్యాలయంలో మంగళవారం బాధితురాలితో మాట్లాడారు. 20 ఏళ్ళ కిందట రైలు ప్రమాదంలో ఆమె భర్త మరణించడంతో పిల్లలను పెంచి పెద్ద చేసింది. ప్రస్తుతం కట్టుకోవడానికి బట్టలుకూడా లేని కడు పేదరికంలో ఉన్న ఆమెను చూసి ఎమ్మెల్యే చలించిపోయారు. తక్షణ సహాయంగా ఆమెకు కొంత ఆర్థిక సాయం, బట్టలు అందించారు. ఆమె పిల్లలకు బట్టలు అందించారు. కేన్సర్ ప్రభుత్వ పరంగా ఆదుకునే ప్రయత్నాలు చేపట్టారు. న్యూఇయర్ వేడుకలకు డబ్బులు పెద్దఎత్తున ఖర్చుచేసేవారు ఇటువంటి వారిని ఆదుకోవడానికి వెచ్చించాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో అనూప్ జైన్, పిల్లి శ్యామ్, చాపల చిన్నరాజు, జైన్ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.



క్యాన్సర్ బాధితురాలికి సాయం చేస్తున్న ఎమ్మెల్యే వాసు

అభాగ్యులకు అండ.. ఎన్‌టీఆర్ భరోసా

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): అభాగ్యులకు కొండంత అండగా ఎన్‌టీఆర్ భరోసా పింఛను పథకం నిలిచిందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 38వ డివిజన్‌లో స్పౌజ్ కేటగిరీలో మంజూరైన పెన్షన్లు సదరు మహిళలకు మంగళవారం అందించి మాట్లాడారు. కుటుంబ పెద్ద మరణిస్తే ఆ కుటుంబం భవిష్యత్తు అగమ్యగోచరంగా ఉంటుందన్నారు. భర్తను కోల్పోయి కుటుంబాన్ని నడపలేక ఆర్థికంగా ఇబ్బందులు పడే వితంతువులకు భరోసా కల్పించేలా తమ కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందన్నారు.భర్తను కోల్పోయిన భార్యకు వెంటనే వితంతు పింఛను మంజూరు చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బుడ్డిగ గోపాలకృష్ణ, బుడ్డిగ రవి తదితరులు పాల్గొన్నారు.



పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

సబ్కా డైరీ ఆవిష్కరణ

రాజమహేంద్రవరం కల్చరల్ డిసెంబర్ 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంట్రాక్టర్స్ అండ్ బిల్డర్స్ అసోసియేషన్(సబ్కా) తూర్పు గోదావరి జిల్లా డైరీని మంగళవారం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన ఆవిష్కరణ కార్యక్రమంలో సబ్కా జిల్లా అధ్యక్షుడు మద్దాల ధర్మాజీరావు, గౌరవాధ్యక్షుడు మేడా వెంకట కృష్ణప్రసాద్, ఉపాధ్యక్షులు కరుటూరి రామారావు, గాజుల రంగారావు,కార్యదర్శి దాట్ల సూర్య నారాయణరాజు,కోశాధికారి నంబూరి గోపాలకృష్ణ, ముత్యాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.







పేపరుమిల్లు అధికారిపై చర్యలు తీసుకోవాలి

బర్రే కొండబాబు డిమాండ్

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం పేపరుమిల్లులో ఒక ఉన్నతాధికారి కామవాంఛకు ఉద్యోగిని బలైందని తక్షణమే అతనిపై చర్య తీసుకుని కఠినంగా శిక్షించాలని కార్పొరేషన్ స్థాయి సంఘం మాజీ చైర్మన్ బర్రే కొండబాబు డిమాండ్ చేశారు.రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పేపరుమిల్లులో ఉన్నతాధికారిగా ఉన్న వ్యక్తి అరాచకాలకు ఉద్యోగులు బలవుతున్నారని చెపారు. మిల్లులో పనిచేస్తున్న ఒక కాంట్రాక్టు కార్మికురాలికి ఏదో ఆశ చూపి బలవంతంగా లొంగదీసుకున్నాడని తెలిపారు. బాధితురాలు ఈ విషయాన్ని సంస్థలో సీనియర్ ఆఫీసర్ నోటీసుకి తీసుకెళ్లినా స్పందించలేదన్నారు. దీంతో గత నెల 10న బొమ్మూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే ఇంతవరకు సరైన చర్యలు లేవన్నారు. ఆ అధికారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.సమావేశంలో గారా నూకరత్నం,సునీత, గారా కుమార్, బూసి సత్యనారాయణ, మారు జగదీష్, పెదపూడి లోవరాజు తదితరులు పాల్గొన్నారు.









ఆర్టీసీ ఆదర్శ ఉద్యోగుల అభినందన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎం షబ్నం

ఆర్టీసీని ప్రగతిపథంలో నిలపండి : డీఎం

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీని ప్రగతిపథంలో నిలపడానికి ఉద్యోగులు, సిబ్బంది మరింత కృషి చేయాలని రాజమహేంద్రవరం డిపో మేనేజర్ షేక్ షబ్నం అన్నారు.రాజమహేంద్రవరం డిపో ఆవరణలో మంగళవారం నిర్వహించిన ఆర్టీసీ ఆదర్శ ఉద్యోగుల అభినందన సభలో ఆయన మాట్లాడారు. డిపోలో అత్యధిక కేఎంపీఎల్ తెచ్చిన ముగ్గురు డ్రైవర్లు, అత్యధిక ఈపీకే తెచ్చిన నలుగురు కండక్టర్లు, ఇద్దరు డ్రైవర్లు, ఇద్దరు గ్యారేజీ సిబ్బందిని సత్కరించారు. వీరికి ప్రశంసాపత్రాలతో పాటు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) ఎం.అజయ్‌బాబు, అసిస్టెంట్ ఇంజనీర్ (మెకానికల్) నాగలక్ష్మి, ట్రాఫిక్, గ్యారేజీ, ఆఫీసు, సెక్యూరిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





కాలం విలువ తెలుసుకో.. విజయం దిశగా సాగిపో..!

కాలం చాలా విలువైనది.. ఒక్క నిమిషం కూడా వెనక్కు తిరిగిరాదు.. నిన్నో.. మొన్నో 2024లో అడుగుపెట్టినట్టుంది.. అప్పుడే 365 రోజులు అయిపోయాయి.. రోజులు క్షణాల్లా గడచిపోయాయి. 2025లో అడుగుపెట్టేశాం.. ఈ ఏడాది ఏం సాధించామంటే.. చాలామందికి ఒక క్వశ్చన్ మార్క్.. ఏదో అలా గడిపేస్తారు.. 2025 మాత్రం అలా కాకూడదు.. మనకంటూ ఒక లక్ష్యం ఉండాలి.. పట్టుదలగా సాధించాలనే తపన ఉండాలి.. అందుకు ఏం చేయాలంటే.. 2+0+2+5 ఫార్ములా వాడాల్సిందే.. విజయం సాధించాల్సిందే.. మన జీవితం మన చేతుల్లోనే ఉంది.. ఒక్కసారి రెడీ వన్ టూ త్రీ అంటూ విజయం దిశగా పరుగెత్తి చూడు.. అపజయం తలవాల్చుతుంది.. ఈ సక్సెస్ ఫార్ములా విజయం వాకిట నిలబెడుతుంది.. హ్యాపీ న్యూ ఇయర్...



2 — ఉదయం.. సమయం..

విజయం సాధించిన ఎవరి జీవితాన్ని తరచి చూసినా అందులో ఉషోదయానిది, సమయపాలనది తొలి వరుస.. నేడు యువత పద్ధతి మారింది.. సమయపాలన అనేది లేకుండా పోయింది.. రాత్రంతా మేల్కొని ఉండడం.. బయట తిరగడమో, లేదా సెల్‌తోనే కాలక్షేపం చేయడం.. ఎప్పుడో తెల్లవారుజామున పడుకోవడం.. ఆలస్యంగా లేవడం ఇదీ దినచర్య. ఉషోదయం చూసే యువతను వేళ్ల మీద లెక్కించవచ్చు. ఈ ఏడాదైనా అది మారుద్దాం.. ఉషోదయాన్నే లేద్దాం.. వాకింగో, వ్యాయామమో చేద్దాం.. ఇక ఎవరికైనా విలువైనది టైమ్. సమయపాలన కూడా విజయానికి బాట వేస్తుందని నిరూపిద్దాం!

0 — హీరో కాదు.. 'జీరో'

యువత చెడు అలవాట్లకు బానిసలుగా మారిపోతున్నారు.. ఈజీ మనీ కోసం ఎగబడుతున్నారు.. గంజాయి.. మందు.. పేకాట.. డ్రగ్స్‌కు బానిసలవుతున్న వారి సంఖ్య పెరుగుతోంది.. మరోవైపు ఈజీ మనీ కోసం పక్కదారి పడుతున్నారు.. గంజాయి రవాణా.. మద్యం అమ్మకాలు తదితర అసాంఘిక కార్యకలాపాలకు అలవాటుపడుతున్నారు.. జీవితాలను చేతులారా నాశనం చేసుకుంటున్నారు.. నేరాల చిట్టా తిరగేస్తే యువత పాత్ర స్పష్టమవుతోంది. డ్రగ్స్, ఇతర చెడు అలవాట్లకు విద్యార్థులూ చిక్కుతున్నారు. ఈ దారిలో ప్రయాణిస్తే హీరోలు అవ్వరు. వీటికి దూరంగా 'జీరో'గా ఉంటేనే బెటర్..!

2 — లక్ష్యం.. సరి'కొత్తగా..'

ప్రతి ఒక్కరికీ ఒక లక్ష్యం ఉండాలి.. సాధించాలనే తపన.. కొత్త ఏడాది చాలామంది ఏవో లక్ష్యాలు పెట్టుకుంటారు. కానీ వాటిని సాధించాలంటే పట్టుదల ఉండాలి.. క్రమబద్ధమైన ప్రణాళిక ఉండాలి. లక్ష్యం కోసం కష్టపడాలి. విజయాన్ని సాధించడమే కాదు, సాధించే క్రమంలో సాగే ప్రయాణాన్ని ప్రేమించాలి. అప్పుడు గురి కుదురుతుంది. లక్ష్యం మీ వశం అవుతుంది. ఈ జనరేషన్‌తో పరుగుపెట్టాలి. అంటే కొత్తగా ఆలోచించాలి. అప్‌డేట్ కావాలి. విద్యార్థులైనా, యువత అయినా, ఉద్యోగులైనా, వ్యాపారులైనా ఏ రంగంలో ఉన్నా కొత్త సమాచారంపై అవగాహన ఉండాలి. టెక్నాలజీపై పట్టు సాధించాలి..!

5 — సక్సెస్‌కు ఐదు మెట్లు..

విజయానికి ఈ ఐదూ పాటించాల్సిందే..

- శ్రమయేవ జయతే అన్నారు.. ఎవరు కష్టపడతారో వారిదే విజయం..
- చెప్పడం కన్నా వినడానికి, తెలుసుకోవడానికి ప్రాధాన్యం ఇవ్వాలి. పుస్తకాలు చదవాలి. లోకం పోకడ, ప్రాపంచిక విషయాలపై జిజ్ఞాస ఉండాలి.
- నాయకత్వ లక్షణాలు ఉంటేనే సరైన విజయం సిద్ధిస్తుంది. బృందంతో కలిసి పనిచేయడంలో చురుకైన పాత్ర ముఖ్యం.
- ఆనందంగా గడిపే సమయం ఉంచుకోవాలి. ఒత్తిడిని అధిగమించాలి. కొత్త ప్రాంతాలను సందర్శిస్తే అదే 'రీచార్జ్'
- బంధాలను నిలుపుకోవడం నిరంతరం సాగాలి. కళాత్మకంగా జీవితాన్ని నిర్మించాలి.

అందరూ సంతోషంగా ఉండాలి..



కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సరం వేళ అన్ని కుటుంబాల్లో సంతోషాలు వెల్లివిరియాలని, ఆరోగ్యంతో అందరూ వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.ఈ మేరకు మంగళవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. న్యూ ఇయర్, సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జిల్లా ప్రజలకు ప్రజాప్రతినిధులు, అధికారులు, అనధికారులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులందరూ చక్కగా చదువుకుని మంచి ఉత్తీర్ణత సాధించాలని అభిలాష వ్యక్తం చేశారు.



- కొత్త ఆశలు, ఆకాంక్షలతో 2025లో అడుగేద్దాం..
- పట్టుదల, ఉక్కుసంకల్పంతో అనుకున్నది సాధిద్దాం
- అత్యున్నత శిఖరాలకు ఎదిగేలా సంకల్పం చెబుదాం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

జీవితం... మన చేతుల్లోనే.. చేతల్లోనే ఉంది.. ఆకాశమంత ఎత్తుకు ఎదగాలన్నా.. అధఃపాతాళానికి పడిపోవాలన్నా అంతా మన చేతుల్లోనే ఉంటుంది. నలుగురు మెచ్చేలా విజయం సాధించి అందరికీ స్ఫూర్తిగా నిలబడేలా అవకాశం అందరికీ వస్తుంది.. కానీ నిలబెట్టుకునేది కొందరే.. తల్లిదండ్రుల మాట వింటూ గురువుల అడుగు జాడల్లో నడిస్తే అనుకున్నది సాధించి ఎంతో ఎత్తుకు ఎదగడం సులువే.. కానీ వారిని ధిక్కరించి కెరీర్‌ను టేకిట్ ఈజీగా తీసుకుని చెడు వ్యసనాలకు బానిసై జీవితాన్ని పాడు చేసుకుంటున్న వారెందరో ఉన్నారు. కొంగొత్త ఆశలతో కొత్త సంవత్సరంలోకి అడుగు పెడుతున్న వేళ.. ప్రతి ఒక్కరూ ఓ చాంపియన్‌గా ఎదగాలనే సంకల్పంతో కదిలితే అనుకున్న రంగంలో యువత విజయం సాధించడం కష్టమేం కాదు.. దీనికి స్ఫూర్తిగా నిలుస్తున్న వారెందరో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచే నిరూపిస్తున్నారు. అందుకే కొత్త సంవత్సరంలోకి అడుగుపెడుతున్న తరుణంలో గోదావరి జిల్లావాడిగా చెబుతున్న ఓ గుకేష్‌లా యువత కెరీర్‌లో విజయతీరాల వైపు కదలాల్సిన తరుణమిదే.

కలలు కనండి.. ఆ కలలను నిజం చేసుకోండి.. అని అబ్దుల్ కలాం అన్నారు.. యువతరం కూడా కలలు కనాలి.. అది నెరవేరే వరకూ గుకేష్ లా ప్రయత్నించాలి.. 18 ఏళ్ల యువకుడు గుకేష్ అతి చిన్న వయసులో వరల్డ్ చెస్ చాంపియన్‌గా నిలిచాడు.. ఈ విజయం ఒక్కరోజుతో వచ్చింది కాదు.. ఎన్నో ఏళ్ల కల.. ఆ కలను ఇటీవల నిజం చేసుకున్నాడు.. అందరి దృష్టిని ఆకర్షించాడు..ఈ ఒక్కడే కాదు.. ఇటువంటి వారెందరో ఉన్నారు.. ఇటీవల రాజమహేంద్రవరానికి చెందిన ఇద్దరు 12, 65 ర్యాంకులు సాధించి యూపీఎస్సీకి ఎంపికయ్యారు.. కోనసీమకు చెందిన మరో కుర్రాడు క్రికెట్ టీంకి ఎంపికై అందరినీ ఆశ్చర్యంలో ముంచాడు.. పట్టుదలతో ప్రయత్నిస్తే సాధించలేనిది ఏమీ లేదు.. అది చెస్ అయినా యూపీఎస్సీ అయినా.. ఇంకెందుకు ఆలస్యం కొత్తగా పయనిద్దాం.. అనుకున్నది సాధిద్దాం!



అనపర్తికి చెందిన బద్రిరాజు లక్ష్మీ సుప్రజ పార్వతి చేసిందిలా..

2024 హీరోలు వీళ్లు..



గుకేష్ · ఉష్ణీష్ నందన్ · ప్రగతి · పీఎస్ఎన్ రాజు

కృషి ఉంటే మనుషులు రుషులవుతారు.. ఉక్కు సంకల్పంతో ముందుకు సాగితే జీవితంలో విజయతీరాలకు చేరుతారు. దీన్ని చేసి చూపించిన వారెందరో. 2024కు వీడ్కోలు పలుకుతూ 2025లోకి అడుగుపెడుతున్న వేళ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో యువత కొత్త ఆశలు.. ఆకాంక్షలతో ముందడుగు వేసేలా సంకల్పం చెప్పుకోవాల్సిన తరుణమిది. ఈ కొత్త ఏడాదిలో విజయం సాధించే దిశగా అడుగులు వేయాల్సిన సమయం రానే వచ్చింది. అది చదువులో అయినా.. ఉద్యోగ సాధనలో అయినా.. మీకు మీరే ఛాంపియన్‌గా ఎదగాలి. ఈ దిశగా ఈ కొత్త ఏడాది నుంచి ఆలోచనల్లో మార్పులతో ముందుకుసాగాలి. జీవితంలో విజయం సాధించడానికి వెన్నంటే మనకు తల్లిదండ్రుల రూపంలో గురువులు ఉంటారు. వీరి ప్రోత్సాహాన్ని విజయానికి మెట్టుగా వాడుకుని ముందుకు కదిలితే ప్రతి ఒక్కరు ఛాంపియన్‌గా ఎదుగుతారు. ఇందుకు ఎందరో విజేతలు జిల్లా నుంచే స్ఫూర్తిగా నిలుస్తున్నారు. 18 ఏళ్ల 18 నెలల వయసులోనే ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా గుకేష్ నిలిచి ఔరా అనిపించారు. రాజమహేంద్రవరానికి చెందిన బోళ్ల ఉష్ణీష్ నందన్ గతంలో జరిగిన యూపీపీఎస్సీలో 71 ర్యాంక్ సాధించి శిక్షణలో ఉన్నాడు.. అయితే ఎందుకో ఆ ర్యాంకు నచ్చలేదు.. పట్టుదలతో చదివాడు.. నవంబరు 22న విడుదలైన ఫలితాల్లో 12వ ర్యాంకు సాధించాడు. బొమ్మూరుకు చెందిన ప్రగతి తొలిసారి యూపీపీఎస్సీలో 65వ ర్యాంకు సాధించి ఔరా అనిపించింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లా రాజోలుకు చెందిన పెన్మత్స సత్యనారాయణరాజు క్రికెట్ టీమ్‌కి ఎంపికై చిన్ననాటి నుంచి ఉన్న తన లక్ష్యాన్ని చేరుకున్నాడు. ఇలా ఒకరేంటి ఉమ్మడి తూర్పుగోదావరిలో 22 లక్షల మంది యువతరంలో పట్టుదల, క్రమ శిక్షణతో ఛాంపియన్‌లుగా నిలుస్తున్నవారెందరో. చదువు, ఉద్యోగం ఏదైనా సరే పట్టుదల, తల్లిదండ్రుల అండదండలతో కెరీర్‌లో సక్సెస్ అయ్యే అవకాశం యువత వదులు కోకూడదు. ఈ కొత్త ఏడాదిలో మీరూ విజేతగా నిలవాలంటే ఈ నూతన సంవత్సరంలో పట్టుదల, క్రమశిక్షణ, జీవితంలో ఎదగాలనే సంకల్పంతో అడుగులు ప్రారంభించాలి. మీరేంటో నిరూపించాలి. విజయం సాధించాలి.

బీసీలకు 1879 యూనిట్లు

రాజమహేంద్రవరం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : బీసీ కార్పొరేషన్ ద్వారా జిల్లాలోని జిల్లాలో బీసీలకు 2024-25కి రూ.52.46 కోట్లతో 1879 యూనిట్లు లక్ష్యంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు.మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.జిల్లాలో స్వయం ఉపాధి కోసం 1229 యూనిట్ల ఏర్పాటుకు మూడు శ్లాబ్‌ల కింద రూ.23.32 కోట్లతో ప్రణాళిక సిద్ధం చేశామన్నారు.ఇందులో బ్యాంక్ రుణం 50 శాతం,సబ్సిడీ 50 శాతం ఉంటుందన్నారు.ఆన్‌లైన్ బెనిఫిషరీ మేనేజ్‌మెంట్ అండ్ మానటరింగ్ సిస్టమ్ (ఓబీఎంఎంఎస్) ద్వారా ఎంపిక చేస్తామన్నారు.మినీ యూనిట్ల కేటగిరిలో 449 యూనిట్ల ఏర్పాటుకు రూ.5లక్షల యూనిట్ కింద రూ.22.46 కోట్లలో ప్రణాళిక సిద్ధం చేశామన్నారు.జనరిక్ మెడికల్ ఫార్మసీ యూనిట్ల కింద మొత్తం 24 యూనిట్లకు ఒక్కో యూనిట్ 8 లక్షల వంతున రూ.కోటి 92లక్షలతో ప్రణాళిక అమలు చేస్తామన్నారు.50 శాతం సబ్సిడీ ఉంటుందన్నారు.

ఆంధ్రజ్యోతి కార్ అండ్ బైక్ రేస్



డిసెంబర్ నెల కూపన్ నంబర్ - 3

పాఠకుని పూర్తి పేరు	:	....
డోర్ నెంబరు	:	....
వీధి పేరు	:	....
గ్రామం / పట్టణం	:	....
మండలం	:	....
జిల్లా	:	....
పోస్టల్ పిన్‌కోడ్	:	....
ఫోన్ నంబర్	:	....

నాలుగు నెలల్లో ఆంధ్రజ్యోతి డ్రాలో ఇది డిసెంబర్ నెల మూడవ కూపన్ ఈ కూపన్‌లో మీ అడ్రస్ పూర్తి చేసి ఈ నెలలో ఇచ్చే మూడు కూపన్లను ఒక సెట్‌గా చేసి మీ వద్దనే ఉంచి మూడు నెలలు అయిన తర్వాత మొత్తం 9 కూపన్లను మూడు సెట్లుగా చేసి 2025 మార్చ్ నెల 10వ తేది నాటికి ఈ క్రింది అడ్రస్‌కు పోస్ట్ ద్వారా కాని, స్వయంగా కాని అందచేయవలెను.



నోట్ : సెట్‌గా కాకుండా విడిగా పంపిన కూపన్లు చెల్లవు.

* చట్ట ప్రకారం నిబంధనలు వర్తించును.

కూపన్లు పంపవలసిన చిరునామా

ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, డో.నెం.114-2-485/2, దివాన్‌చెరువు టు వెలుగుబంద రోడ్డు, పాలచర్ల (గ్రామం), రాజానగరం మండలం, రాజమహేంద్రవరం పిన్-533 102.
బ్రాంచ్ మేనేజర్ : 9985411241, సర్క్యులేషన్ మేనేజర్ : 9985411247



ఉండ్రాజవరం మండలం పసలపూడిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి దుర్గేష్

ఆనందించేన్
ఒక్క రోజు ముందే పింఛన్లు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఒక్క రోజు ముందుగానే పింఛన్ల పండగ వచ్చేసింది.. కొత్త ఏడాదిని ఆనందంగా జరుపుకోవాలని సీఎం చంద్రబాబు ఒక్కరోజు ముందుగానే మంగళవారం పింఛన్లు పంపిణీ చేయించారు. జిల్లాలో పింఛన్లు పంపిణీ అత్యంత వేగంగా సాగింది. రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం రాత్రి 7:55 గంటలకు 95.48 శాతం పింఛన్లు పంపిణీ పూర్తి చేశారు. జిల్లాలో 96.19 శాతం పింఛన్లు బట్వాడా చేసారు. ఉదయం 5 గంటల నుంచి పంపిణీ ప్రారంభించిన జిల్లా యంత్రాంగం రాత్రికి సుమారు 98 శాతం వరకు పూర్తి చేసింది. జిల్లాలో పింఛనుదారులు 2,36,927 ఉండగా 2,28,295 మందికి ఒక్కరోజులోనే పింఛన్లు అందజేశారు. జిల్లాకు రూ.101,93,56,000 విడుదల కాగా వాటిలో రూ.98,05,55,000 పంపిణీ చేశారు. ఇంకా పంపిణీ కొనసాగుతుంది. రాజమహేంద్రవరంలో 28,596 పింఛన్లకు 27774 పంపిణీ చేశారు. రూరల్‌లో 19691 మందికి 18951 మందికి అందజేశారు. కోరుకొండలో 12209 కు 11841 పంపిణీ చేశారు. రాజానగరంలో 15329 కి 14823 ఇచ్చారు. చాగల్లులో 9296కి 8989 అందజేశారు. నల్లజర్లలో 11446కి 11052 పంపిణీ చేశారు. గోపాలపురంలో 9059కి 8744 పంపిణీ చేశారు. దేవరపల్లిలో 10921 కి 10534 అందజేశారు. కొవ్వూరులో 10083 కి 9714 పంపిణీ చేశారు. గోకవరంలో 10460 కి 10076 పంపిణీ చేశారు. కడియంలో 11836కి 11392 పంపిణీ చేశారు. తాళ్ళపూడి మండలంలో 7806 పింఛన్లకు 7501 అందించారు. సీతానగరంలో 11472 కి 11021 పంపిణీ చేశారు. నిడదవోలులో 10374 కి 9959 పంపిణీ చేశారు. రూరల్‌లో 4242కి 4070 పంపిణీ చేశారు. రంగంపేటలో 8800కి 8438 అందించారు. పెరవలి మండలంలో 10231 కి 9825 పంపిణీ చేశారు. ఉండ్రాజవరంలో 10350 కి 9912 ఇచ్చేశారు. అనపర్తిలో 10231 కి 9796 పంపిణీ చేశారు. బిక్కవోలులో 10557 కి 10101 ఇచ్చారు.కొవ్వూరు రూరల్‌లో 3920 కి 3749 పింఛన్లు పంపిణీ చేశారు.కోరుకొండ మండలంలో కేవలం మూడు గంటల్లోనే పింఛన్లు పంపిణీ పూర్తిచేయడం గమనార్హం.

SANTOOR సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీ — ఆంధ్రజ్యోతి ABN

తూర్పుగోదావరి జిల్లా ముగ్గుల పోటీల స్పాన్సర్



శ్రీ ఆదిరెడ్డి శ్రీనివాస్(వాసు) గారు
రాజమండ్రి సిటీ శాసనసభ్యులు
భవాని చారిటబుల్ ట్రస్ట్
రాజమహేంద్రవరం

అందమైన ముగ్గులు వేయండి.. ఆనందంగా బహుమతులు అందుకోండి.
రాష్ట్ర స్థాయిలో విజేతలకు రూ.1,50,000/-లకు పైగా బహుమతులు.

ముగ్గుల పోటీలు జరిగే ప్రదేశం:
శ్రీ షిర్డీసాయి విద్యానికేతన్
ఆల్ బ్యాంక్ కాలనీ, నియర్ మోరంపూడి జంక్షన్
కాంటాక్ట్ నెం: 9985411248

పోటీలు జరిగే తేదీ: జనవరి 4 (శనివారం)
సమయం: ఉ. 10గంటల నుంచి

నిబంధనలు - ■ మహిళలు మాత్రమే పాల్గొనాలి ■ చుక్కల ముగ్గులు మాత్రమే వేయాలి ■ ఎన్ని చుక్కలు, ఎన్ని వరుసలు చెప్పగలిగి ఉండాలి ■ ముగ్గు, రంగులు వగైరా పోటీదారులే తెచ్చుకోవాలి ■ ముగ్గు వేయడానికి గరిష్ట సమయం రెండు గంటలు.

మొదటి బహుమతి	రూ.6,000/-
రెండో బహుమతి	రూ.4,000/-
మూడో బహుమతి	రూ.3,000/-

యవ్వనపు చర్మ రహస్యం



Fashion Partner
DIGSEL WOMEN'S
సెల్సియా — ట్రెండీ మహిళల అంతర్గత దుస్తులు
selsia — TRENDY WOMEN'S
BRA - PANTIES - SLIPS & LEGGINGS
SCAN & BUY
TRADE ENQUIRY : 93445 53675

Gardening Partner
ఎటువంటి పంటలకైనా క్రాఫ్ట్ వారి పెర్‌ఫెక్ట్

ఆకు కూరలు, కూరగాయలు, పళ్ల పంటలు, మిరప, పొగాకు, పసుపు వంటి వాణిజ్యపంటలు, వరి, రాగి మొదలైన పంటలు, మిద్దెతోటలు, పెరటి తోటలకైనా చీడపీడలబారిన పడకుండా, లేదా చీడపీడలతో ఆకు ముడలతో పంట పాడైనా రామబాణం లాంటిది 'పెర్‌ఫెక్ట్'. ఒక్క లీటరు నీటికి కేవలం 2ఎంఎల్ పెర్‌ఫెక్ట్‌ను కలిపి పిచికారి చేయడం ద్వారా చీడపీడలు, ఆకుముడత, మిరపలో నల్లతామర వంటి రోగాలను నివారించి, ప్రారదోలి మొక్కలు నూతన జవసత్వాలతో ఏపుగా పెరిగి, (7-15 రోజులకొకసారి పిచికారి చేయవలసి ఉంటుంది) కొత్తపూత పిందెలతో అధిక దిగుబడినిస్తుంది.

✔ వృక్ష ఆయుర్వేదం (100%) ఆర్గానిక్ ✔ సేంద్రీయ వ్యవసాయం ✔ రసాయనిక అవశేషాలు లేని పంటల ఉత్పత్తి ✔ 11 వనమూలికల ఔషధ సమ్మేళనం ✔ సమగ్ర సస్య సంరక్షణ

B.Sc. (Agri), B.Sc.(Horti), Agri Business Management, Any Degree చేసినవారికి ఏరియా/ జిల్లాల వారీగా ఉద్యోగావకాశాలు కలవు. ఆకర్షణీయమైన ఆదాయం. ఆసక్తిగలవారు మెయిల్‌ద్వారాగానీ, ఫోన్‌ద్వారా గానీ సంప్రదించండి.

ఈమెయిల్ ID: globalgreenperfekt@gmail.com, వెబ్‌సైట్: www.perfektindia.in, కస్టమర్ కేర్ నంబర్లు: 94482 74211, 73377 74148



సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

అవగాహన సదస్సులో విద్యార్థులతో కొవ్వూరు సీఐ విశ్వం

కొవ్వూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సీఐ పి.విశ్వం అన్నారు. స్థానిక ఏబీఎన్ అండ్ పీఆర్ఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు సైబర్ నేరాలు తీసుకోవలిసిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ విశ్వం, సైబర్ క్రైమ్ సిబ్బంది వైవీఎస్. సురేష్, డి.మహేష్, అబ్దుల్ షోకాద్ మొబైల్ వాడకం వల్ల కలిగే అనర్థాలను తెలియజేశారు. డిజిటల్ అరెస్టు, ఫేక్ లోన్ యాప్స్, టాస్క్ ఫ్రాడ్, ఫీడెక్స్ మోసాలు, ఫిషింగ్ లింక్స్, వాట్సాప్ హ్యాక్, ఇన్వెస్టిమెంటు ఫ్రాడ్ వంటి అంశాల్లో జరిగే సైబర్ మోసాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.రామ్మోహన్, వైస్ ప్రిన్సిపాల్ ఎల్లాప్రగడ రమేష్, ఎస్ఎస్ఎస్ పీవో బి.సత్యనారాయణ, అధ్యాపకులు పి.మురళీధర్, బి.శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ కెమేరాల అందజేత

కొవ్వూరులోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేయడానికి బంగారు వర్తకులు 10 సీసీ కెమేరాలను సీఐ విశ్వంకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని బంగారు వర్తకులతో పాటు వ్యాపారస్తులందరూ తమ వ్యాపార సంస్థల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలన్నారు. నేరాలు జరిగినప్పుడు నేరస్తులను పట్టుకోవడంలో అవి ఉపయోగపడ తాయన్నారు. కార్యక్రమంలో బంగారు వర్తకుల అసోసియేషన్ అధ్యక్షుడు కట్టా చైతన్య, మేకా వీర్రాజు, కనిశెట్టి లక్ష్మణరావు, గొర్లి త్రినాథరావు, వైకె రామారావు, ఉషశ్రీ, వంశీ పాల్గొన్నారు.

సేవల్లో ఉత్తమం పెరవలి పోలీసుస్టేషన్



ఎస్పీ నుంచి మెమెంటో అందుకుంటున్న పెరవలి ఎస్ఐ

పెరవలి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): పెరవలి పోలీసుస్టేషన్ అత్యున్నత ప్రగతిని కనబరిచిందుకు గాను ఎస్పీ డి.నరసింహకిషోర్ చేతుల మీదుగా ఎస్ఐ వెంకటేశ్వర్లు మెమెంటో అందుకున్నారు. రాజమహేంద్రవరంలో నిర్వహించిన జిల్లా క్రైమ్ సమీక్షలో సమావేశంలో పెరవలి పోలీసు స్టేషన్ రికార్డుల నిర్వహణలోనూ, కేసుల పురోగతి, ఫిర్యాదుల స్వీకరణ, పోలీసుస్టేషన్ ఆవరణ తదితర విషయాల్లో ఉత్తమమైనదిగా ఎస్పీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐతోపాటు స్టేషన్ సిబ్బందని ఆయన అభినందించారు.

బీజేపీ తాళ్లపూడి అధ్యక్షుడిగా
ఇండుగుల రామకృష్ణ

తాళ్లపూడి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండలాధ్యక్షుడిగా ఇండుగుల రామకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ మండల నూతన కమిటీ ఎన్నిక కార్యక్రమానికి ఎన్నికల అధికారిగా బూసి సురేంద్రనాథ్ బెనర్జీ, ఏఆర్‌వోలుగా కొమ్మిరెడ్డి శ్రీనివాష్, మల్లిపూడి రాజేష్‌లు వ్యవహరించారు. కేంద్ర ప్రభుత్వ విధివిధానాలతో పాటు పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బెనర్జీ కోరారు. కార్యక్రమంలో మద్దుకూరి రజని, ఇమ్మణ్ణి అనసూయమ్మ, గోకవరపు జితేంద్ర రవి, కిల్లాని వెంకటరమణ, కలిశెట్టి సన్యాసినాయుడు, చల్లా సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నిడదవోలు మండల పరిషత్
సర్వసభ్య సమావేశం

నిడదవోలు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జరుగుతున్న గ్రామ రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని తహశీల్దార్ నాగరాజు నాయక్ అన్నారు. మంగళవారం నిడదవోలు మండలం సమిశ్రగూడెం గ్రామంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా గ్రామ స్థాయి అధికార్లు కృషి చేయాలన్నారు. సమావేశంలో జడ్పీటీసీ కొయ్యే సూరిబాబు గ్రామ కార్యదర్శులు, రెవెన్యూ అధికార్లు పాల్గొన్నారు.

జనసేన నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

దేవరపల్లి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): లక్ష్మీపురంలో జనసేన పార్టీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి సువర్ణరాజు ఆవిష్కరించారు. గ్రామానికి చెందిన జనసేన నాయకులు పోలుమాటి నాని, పోలుమాటి లక్ష్మణ్, ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను సువర్ణరాజు చేతుల మీదుగా పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అందజేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాకా సీఎం చంద్ర బాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లో ఎంతో ఆనం దాన్ని పెంచాయన్నారు. కార్యక్రమంలో అనిశెట్టి గంగరాజు, కాట్నం గణేష్, అనిశెట్టి మధు, అడబాల మణికంఠ, నున్నా చిన్ని, యాగంటి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని యువకుడి మృతి
మరొకరికి గాయాలు

నల్లజర్ల, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): నల్లజర్ల శివారులో సోమవారం రాత్రి ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. ఏఎస్ఐ సోభనాద్రి వివరాల ప్రకారం ఒరిస్సా రాష్ట్రానికి చెందిన షేక్ ధసలిమ్(29), షేక్ అషాపద్ అనంతపల్లిలో ఒక దాబాలో పని చేస్తున్నారు. పని నిమిత్తం బైక్‌పై తాడేపల్లిగూడెం వెళుతుండగా ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ధస్లిమ్ అక్కడిక్కడ మృతి చెందాడు. గాయాల పాలైన అషాపద్‌ను ఏలూరు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ చెప్పారు.

బైక్ ఢీకొని వృద్ధుడి మృతి



మృతుడు కృష్ణయ్య

తాళ్లపూడి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బల్లిపాడు గ్రామంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. బల్లిపాడు గ్రామానికి చెందిన ఇందుగుమెల్లి కృష్ణయ్య(60) సోమవారం రాత్రి గ్రామం లో రోడ్డు దాటుతుండగా నందమూరు గ్రామానికి చెందిన అరిమిల్లి శ్రీను తన ద్విచక్ర వాహనంతో వేగంగా వచ్చి ఢీకొనడంతో పడి పోయిన కృష్ణయ్య తలకు బలమైన గాయమైంది. అతడిని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారంతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు.

మధుశేఖర్‌కు పదవి విరమణ సన్మానం

చాగల్లు, డిశంబరు 31 (ఆంధ్రజ్యోతి: స్థానిక హైస్కూల్లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేసిన కోనాల శ్యామ్ ఇస్సాక్ మధు శేఖర్ పదవి విరమణ సన్మాన కార్యక్రమం వేడుకగా జరిగింది. ప్రధానోపాధ్యాయుడు మోహన కృష్ణ, పి.వీర్రాజు మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి విద్యార్థుల అభిమానంతో పాటు తోటి ఉపాధ్యాయుల గౌరవ మన్నలు పొందిన వ్యక్తి శేఖర్ అని కొనియాడారు. సమాజంలో బాధ్యతయుతమైన సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు, బంధు మిత్రులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావం బహిరంగ సభ
పోస్టర్ ఆవిష్కరణ

దేవరపల్లి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): దేవాలయాల పరిరక్షణ కోసం దేవాలయాల స్వయం ప్రతిపత్తి కోసం ఈ నెల 5న విజయవాడ సమీపంలోని కేసరపల్లిలో జరిగే బహిరంగసభకు హాజరవ్వాలని విశ్వహిందూ పరిషత్ మండల కన్వీనర్ బలుసు సత్యనారాయణ కోరారు. చిన్నాయిగూడెంలో హైందవ శంఖరావం గోడపత్రికను మాజీ ఎంపీపీ గడా మురళీ అజిత్‌కుమార్ మంగళవారం ఆవిష్కరించారు. సత్యనారాయణ మాట్లాడుతూ మండలం నుంచి 25 బస్సులు, 50కార్లు, 100 మోటార్ సైకిళ్లపై విజయవాడ వెళ్తున్నట్టు తెలిపారు. ఈ సభ విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి ముత్యాల గంగాధరరావు, బొడ్డు శ్రీరామకృష్ణ, మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పఠనం

తాళ్లపూడి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): హైందవ శంఖారావానికి మద్దతుగా మండలంలోని ప్రక్కిలంకలోని అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ఆలయ కమిటీ, గోపవరం కోడూరి రాధా శ్రీరామా భజన భక్తబృందం ఆధ్వర్యంలో 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు
నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు
2025
శ్రీ శ్రీనివాస ఎలక్ట్రికల్స్
డోర్ నెం.7-30-26, మెయిన్‌రోడ్, రాజమండ్రి-533 101
ఫోన్: 0883-2426173, సెల్:7036207711, 7036207733
TEXMO టెక్స్‌మో AQUA GROUP AQUATEX ఆక్వాటెక్స్ Godavari HDPE Pipes ashirvad
ఆథరైజ్డ్ డీలర్స్
టెక్స్‌మో సబ్ మెర్సిబుల్ మోటార్స్ 4", 6",8" సైజు బోరులకు సింగిల్ ఫేస్ మోటార్లు, మోనోబ్లాక్స్, జెట్‌పంపులు, ఆక్వాటెక్స్ అగ్రికల్చరల్ మోనో బ్లాక్స్, స్టార్టర్లు, గోదావరి HDPE పైపులు వగైరా.

Best Complete form

THE PRAKASAM NAGAR CO-OPERATIVE BUILDING SOCIETY LTD., NO.B-802
D.no.81-21-1/3, Godavari Towers
Sri Venkateswara Nagar, Rajamahendravaram

MANAGING COMMITTEE

Sri D.B. Venkatapathi Raju	President
Sri V. Bhaskar Ram	Vice President
Sri B. Syamala Rao	Director
Sri A.V. Narasimha Rao	Director
Sri M.Kesava Raju	Director
Sri K.Raja Prasad	Director
Sri K.V.Subba Rao	Director
Sri D.Subba Reddy	Director
Smt A.Gayatri	Director
Sri S.Rama Krishna	Secretary

Completed Ventures (Layouts)	Residential Flats
1. Prakasam Nagar, Block-1	Sai & Netaji Towers
2. Prakasam Nagar, Block-2	Godavari &
i) Sri Venkateswara Nagar	Gowtham Towers
ii) Sri Padmavathi Nagar	Vasista Residency
iii) Prakasam Nagar Block-3 Santhi Nagar	Balaji Towers
iv) Ram Nagar, Prakasam Nagar Block-4	

TRIPS INTERNATIONAL SCHOOL
3-1166, TRIPURA NAGAR, GADALAMMA NAGAR, RAJAHMUNDRY-533107
AFFILIATED TO CBSE BOARD - CLASSES I to XII
New Year 2025 Greetings & Best Wishes
20+ years of legacy in achieving top class results & placements
MPC, BIPC, MEC, MBEP, IIT-JEE/NEET
2 years Integrated Program for CBSE XI & XII
HIGHLY QUALIFIED & EXPERIENCED FACULTY
NEET JEE Main JEE Advanced
BITSAT VITEEE SRMJEEE EAPCET
ICAR CMA IPMAT CA Foundation
CLAT CUET SET LSAT CAT
SAT ACT TOEFL IELTS
OTHER EXAMS FOR INTERNATIONAL UNIVERSITIES
Futuristic Curriculum - Personalized Counselling System
Strong Communication Skills - Limited Admissions
2025-26 ADMISSIONS OPEN
Contact: 9133174446/9133144446

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

కొవ్వూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు మండల యూటీఎఫ్ క్యాలెండర్, డైరీని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. మంగళవారం కొవ్వూరులోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో యూటీఎఫ్ మండలాధ్యక్షుడు ఆర్.సురేష్ ఆధ్వర్యంలో క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కూటమి..హామీల అమలు

- మంత్రి కందుల దుర్గేష్
- పసలపూడిలో పింఛన్ల పంపిణీ
- పెరవలిలో రోడ్డు పనులకు శ్రీకారం



పెరవలిలో రోడ్డు మరమ్మతులు ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్

ఉండ్రాజవరం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చుతున్నట్టు రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పసలపూడిలో ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్ల పెంపు ప్రభుత్వానికి ఆర్థిక భారమైనా పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. గత ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసి వెళ్లిందని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యంత్రి పవన్‌కళ్యాణ్ రాష్ట్రాన్ని ప్రగతి పథంలోనికి తీసుకువెళ్లడానికి కృషి చేస్తున్నట్టు మంత్రి చెప్పారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని రైతులకు 24 గంటల వ్యవధి లోనే వారికి ధాన్యం డబ్బులను ప్రభుత్వం జమ చేస్తోందన్నారు. అనంతరం అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి నూతన సంవత్సర క్యాలెండర్‌ను, ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘ క్యాలండర్‌ను దుర్గేష్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఎం.సం దీప్, ఇన్‌చార్జి తహశీల్దార్ ఎ.కనకదుర్గ, ఎంపీడీవో వీఎస్ రామారావు, పెరవలి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ బూరుగుపల్లి శ్రీనివాసరావు, టీడీ పీ మండలాధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, నాయకులు వీరమళ్ల బాలాజీ, బలుసు వెంకటరత్నం, కె.సోమేశ్వరరావు, గూన ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతికి రోడ్డు మరమ్మతులు పూర్తి

పెరవలి, డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): మండలంలోని మార్టేరు, ప్రత్తిలంక ఆర్‌అండ్‌బీ రహదారుల మరమ్మతుల నిమిత్తం ప్రభుత్వం రూ.1.17 కోట్ల నిధులు మంజూరు చేసింది. దీనిలో భాగంగా పెరవలిలో చేపట్టిన పనులను మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్రాంతి నాటికి రహదారులను పూర్తి చేయడమే ప్రభుత్వ ధ్యేయమని, దీనిలో భాగంగానే ప్రస్తుతం రోడ్ల మరమ్మతులు జరుగుతున్నాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో రోడ్లన్నీ అధ్వానంగా మారాయని, రోడ్ల మరమ్మతుల నిమిత్తం ఒక్క రూపాయి కూడా కేటాయించిన పాపాన పోలేదని విమర్శించారు. ఈ సందర్భంగా రూ.3.80కోట్లతో ఉసులుమర్రు-కానూరు సీసీ రోడ్డు వేయడానికి అంచనాలు తయారు చేశారని దీని మంజూరుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అతికాల వెంకట రామకృష్ణమ్మ(శ్రీను), పిప్పర రవి, బొడ్డు రామాంజనేయులు, సలాది కృష్ణమూర్తి, సలాది శ్రీహరి, నాగిరెడ్డి నాగేశ్వరరావు, నందిప శ్రీనివాస చక్రవర్తి, ఆర్‌అండ్ బీ ఏఈ రూప కుమార్, పి.వెంకటరమణ, ఏఈ శ్రీనివాస్, తహశీల్దార్ అచ్యుతకుమారి పాల్గొన్నారు.

గత ప్రభుత్వంలో అంతా రివర్సే

- ఎమ్మెల్యే ముప్పిడి
- కొవ్వూరులో పింఛన్ల పంపిణీ



కొవ్వూరులో ఫించను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): జగన్మోహనరెడ్డి ప్రభుత్వంలో అంతా రివర్స్‌పాలనే కొనసాగిందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం కొవ్వూరులో సామాజిక ఫించన్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో భర్త చనిపోయిన ముగ్గురు మహిళలకు, మండలంలో ఆరుగురు మహిళలకు మరుసటి నెల నుంచే పింఛన్లు మంజూరు చేసి పంపిణీ చేశామన్నారు. జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత అంతా రివర్స్ పాలన ఏలా సాగిందో పింఛన్ల విషయంలోను అలాగే జరిగిందన్నారు. పింఛను తీసుకునే భర్త చనిపోతే.. అర్జీ పెట్టుకున్న 6 నెలలకు పింఛను మంజూరు చేసేవారని, అయితే కూటమి ప్రభుత్వంలో భర్త చనిపోయిన మహిళలకు ఆ మరుసటి నెల నుంచే పింఛను పంపిణీ చేస్తున్నారన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికి కొత్త పింఛన్లు, రేషన్‌కార్డులు అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కొవ్వూరులో 3,920 మందికి గాను 3,734 మందికి(95.26 శాతం), కొవ్వూరు మండలంలో 10,083 మందికి గాను 9,521 మందికి(94.43 శాతం) పింఛన్లు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు, సూరపనేని చిన్ని, దాయన రామకృష్ణ, సూర్యదేవర రంజిత్, పెనుమాక జయరాజు, అర్దిల్లి రామకృష్ణ, కౌన్సిలర్ మురుకొండ నాగమణి, మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు

2025 సంవత్సరంలో ప్రతిఒక్కరికి శుభాలు కలగాలని, ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలంటూ కొవ్వూరు నియోజకవర్గ ప్రజలకు, కూటమి నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో సరికొత్త ఆలోచనలు, ఆశయాలు, ఆకాంక్షలతో ముందుకు సాగాలన్నారు.

సిమెంటు రోడ్ల నిర్మాణం

గోపాలపురం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో పల్లెల్లో సిమెంటు రోడ్ల నిర్మాణ పనులు యుద్ధప్రతిపాదికన జరుగుతున్నాయి. మండలంలో 2.9 కిలోమీటర్ల సీసీ రోడ్లు ప్రతిపాదనలు పంపగా ఇప్పటివరకు 2.6 కిలోమీటర్ల నిర్మాణ పనులకు సంబంధించి ఉపాధి హామీ పథకం నిధులు రూ.1.43 కోట్లు మంజూరయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లోని అంతర్గత సిమెంట్ పనులు చకచక జరుగుతున్నాయి. సంక్రాంతి సందర్భంగా ఈ నెల 7న ప్రారంభమయ్యే పల్లెపండుగ కార్యక్రమా నికి మొత్తం నియోజకవర్గంలో మంజూరైన అంతర్గత రహదారులకు మహర్దశ కల్పించాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఆధ్వర్యంలో యుద్ధప్రతిపాదికన జరుగుతున్న ఈ నిర్మాణ పనులను అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు: మద్దిపాటి



ముసుళ్లకుంట పంచాయతీ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

నల్లజర్ల, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): గ్రామాలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్టు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు. మంగళవారం నల్లజర్ల పార్టీ కార్యాలయంలో ముసుళ్లకుంట గ్రామ పంచాయతీ-2025 క్యాలెండర్‌ను సర్పంచ్ నందమూరి శారదదేవి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.25 కోట్ల నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు ప్రారంభించామని, జనవరి నుంచి నియోజకవర్గంలో గుంతలు లేని రోడ్లు వేస్తామన్నారు. గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు నందమూరి రామకృష్ణ, అయినపూడి రత్నకుమార్,వార్డు నెంబర్లు కొయ్యలమూడి కృష్ణమూర్తి, వెల్లి సుబ్బారావు, పాకలపాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

- సీపీఎం నాయకుడు కృష్ణారావు
- దేవరపల్లి, కొవ్వూరులో నిరసనలు



దేవరపల్లిలో ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

దేవరపల్లి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అంబేడ్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు బహిరంగ క్షమాపణ చెప్పి పదవికి రాజీనామా చేయాలని సీపీఎం నాయకుడు ఉండవల్లి కృష్ణారావు అన్నారు. సీపీఎం నాయకులు దేవరపల్లిలోని బస్టాండ్ సెంటర్ వద్ద నిరసన ర్యాలీ, ఆందోళన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కృష్ణారావు మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంపై ప్రమాణం చేసి హోంమంత్రిగా పదవి అనుభవిస్తున్న అమిత్‌షా ఆయన పట్ల అవహేళనగా మాట్లాడడం తగదన్నారు. ఆర్ఎస్ఎస్ మనువాద భావజాలం అనుగుణంగానే అమిత్‌షా మాట్లాడుతున్నారని విమర్శించారు. క్యాక్రమంలో సీపీఎం, కార్మిక సంఘాల నాయకులు సీహెచ్ రమేష్, షేక్ మస్తాన్, ఎం.సుందర్ బాబు, పెంటయ్య, రత్నాజీ పాల్గొన్నారు.

కొవ్వూరు: కొవ్వూరు బస్టాండ్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం పట్టణ కార్యదర్శి బీరా రవి ఆధ్వర్యంలో వా మపక్ష నాయకులు నిరసన తెలిపారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎం.సుందరబాబు మాట్లాడుతూ మహిళలందరికీ సమాన హక్కుల కోసం, హిందూ కోడ్ బిల్లు ఆమోదం కోసం అంబేడ్కర్ ఆనాడు పట్టుబట్టారని ప్రభుత్వం ఆమోదించక పోవడంతో న్యాయశాఖ మంత్రి పదవికి రాజీనామా చేశారని గుర్తుచేశారు. దేశంలో మను ధర్మాన్ని తీసుకురావడానికి ఆర్ఎస్ఎస్, బీజేపీ చేస్తున్న ప్రయత్నాన్ని వ్యతిరేకించారు. కార్యక్రమంలో ఎంజే భాను, పి.గంగాధరం, డి.రాధాకృష్ణ, కె.కనకరావు, పెనుమాక జయరాజు, సాకా పుల్లారావు పాల్గొన్నారు.

రేషన్ డీలరు పోస్టులకు నోటిఫికేషన్

కొవ్వూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న రేషన్ డీలరు పోస్టులను భర్తీ చేయడానికి నోటిఫికేషన్ జారీ చేసినట్టు ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. డివిజన్‌లో చౌకధరల దుకాణం డీలరు రాజీనామా, మరణం వల్ల ఖాళీ అయిన డీలర్లు, రేషన్‌కార్డులు సర్దుబాటు వల్ల కొత్తగా ఏర్పడిన ఖాళీలను శాశ్వత ప్రాతిపదికన డీలర్లు నియమానికి రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేయనున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు నోటిఫికేషన్‌లో పొందుపర్చిన నిబంధనలకు లోబడి తమ దరఖాస్తులను సంబంధిత తహశీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లో ఈ నెల 10వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు అందజేయాలని ఆర్డీవో చెప్పారు. దరఖాస్తుల కోసం తహశీల్దార్, ఆర్డీవో కార్యాలయ పనివేళల్లో పొందవచ్చునన్నారు.

రీసర్వేతో రైతులకు మేలు

దేవరపల్లి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎంతో ప్రతిష్టా త్మకంగా రీసర్వే చేపట్టిందని, దీని వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని తహశీల్దార్ కె.రాజ్యలక్ష్మి అన్నారు. చిన్నాయిగూడెంలో ఈ నెల 2వ తేదీ నుంచి రీసర్వే 3వ ఫేజ్ ఎంపికలో భాగంగా గ్రామంలో రైతులకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించినట్టు ఆమె తెలిపారు. గ్రామ ప్రజలు, రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ముమ్మిడి సత్యనారాయణ, పిన్నమనేని సత్యనారాయణ, ఆచంట నాగేశ్వరరావు, గడా నరసింహరావు, సర్పంచ్, వీఆర్వోలు పాల్గొన్నారు.

మా ఖాతాదారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు
నూతన సంవత్సర శుభాకాంక్షలు 2025
శ్రీ మణిజ్యోతి టెక్స్‌టైల్స్
షాపునెం.6,7, కర్రి సూరారెడ్డి కాంప్లెక్స్, ఆడితోట
రాజమహేంద్రవరం, ఫోన్:2441274, సెల్:9848224799

నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు
ఫైర్ హైడ్రెంట్ వర్క్స్ అందుబాటు ధరలో
NBC 2016 అనుసరించి
గత 18 సం॥లుగా మమ్ములను ఆదరిస్తున్న మా కస్టమర్లకు, వినియోగదారులకు, మిత్రులకు మరియు శ్రేయోభిలాషులకు నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలతో...
పి. నరేష్‌కుమార్ చిరుకుపల్లి
A member of FSAI amaravathi chapter
FSAI
CJRL FIRE & SAFETY SERVICES
D.No. 2-29, MIG-29, Shop No.2, APHB Colony, Lalacheruvu, RAJAHMUNDRY-3. Cell: 98484 51381, 98480 51381
email : cjrl.fire@gmail.com web : www.cjrlfire.com

నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు
మాకు అత్యంత ఆప్తులు, మా ప్రియతమ నాయకులు, కొత్తపేట నియోజకవర్గ శాసన సభ్యులు
శ్రీ బండారు సత్యానందరావు గార్కి
మరియు జిల్లా ప్రజలకు, కార్యకర్తలకు, నాయకులకు, శ్రేయోభిలాషులకు
నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలతో...
శ్రీ బండారు సత్యానందరావు గారు
శాసన సభ్యులు, కొత్తపేట
Happy NEW YEAR 2025
కరుటూరి నరసింహారావు
సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్
మాజీ చైర్మన్, శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం, వాడపల్లి
మాజీ సర్పంచ్, అంకంపాలెం
శ్రీమతి కరుటూరి విశ్వేశ్వరి
ఉప సర్పంచ్, అంకంపాలెం